తెలుగు మాసపత్రిక

# కమలవాణి
# KAMALAVANI

రూ.25/-
పేజీలు : 52
సంపుటి : 26   సంచిక : 11 నవంబరు 2025




## సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ప్రధాని నరేంద్రమోడీ



కాకినాడలో వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు



భాజపా జోన్‌లవారీ మండల స్థాయి ప్రశిక్షణ కార్యక్రమాలు



గోవాలో శ్రీరామ విగ్రహ ప్రారంభోత్సవంలో
ప్రధాని శ్రీ నరేంద్రమోడీ

తెలుగు మాసపత్రిక

# కమలవాణి
KAMALAVANI

సంపుటి : 26 సంచిక : 11 నవంబరు 2025

లోపలి పేజీల్లో

- సేవే భారతీయ నాగరికత మూలం 4
- ఆదివాసీల అభ్యున్నతికి కృషి 12
- వందేమాతరం భారతదేశ ఆత్మ 18
- దేశ సమైక్యతకు వజ్రాయుధం 22
- ఆర్థిక, విజ్ఞాన, సాంకేతిక కేంద్రంగా అమరావతి 24
- రైతుకు ప్రాణాధారం 26
- మహిళా శక్తి బలోపేతానికి చారిత్రక కృషి 30
- బీహార్‌లో ఎన్డీఏ ప్రభంజనం 32
- సుపరిపాలన, అభివృద్ధి విజయం 34
- మహానేత వాజ్‌పేయి 38
- సాంకేతికత కేంద్రీకృతం కావాలి 40
- దేశాధినేతలతో మోడీ భేటీ 42
- అట్టడుగు వర్గాల సంక్షేమానికి బాట 44
- జిల్లా అధ్యక్షుల సమావేశం 46
- కోస్తా జోన్ మండలాల ప్రశిక్షణ కార్యక్రమం 50
- గోదావరి జోన్ మండలాల ప్రశిక్షణ కార్యక్రమం 52
- ఉత్తరాంధ్ర జోన్ ప్రశిక్షణ కార్యక్రమం 54
- రాయలసీమలో బలమైన ముద్ర 56
- కొత్తగా 3 జిల్లాలు – 5 రెవిన్యూ డివిజన్లు 58
- గిరిజన స్వేచ్ఛా పోరాట నిప్పుకణిక 60
- యువత "భారత భాగ్యవిధాత" 62

మీ వార్తలు, సంబంధిత ఫొటోలు, ఫొటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా మెయిల్‌లో కూడా కమలవాణికి పంపించవచ్చు. మీరు పంపాల్సిన చిరునామా ఈ మెయిల్ Kamalavani 2017@ gmail.com

Published and Printed by NUKALA MADHUKAR on behalf of Bharateeya Janata Party and Printed at Kala Jyoti Process Pvt Ltd, Nidumukkala village, Tadikonda mandal,GUNTUR - 522016. A.P. Editor : VAMARAJU SREE SATYA MURTY Phone: 0866-2441135

Vulluri Gangadhar, Associate Editor,
Ch.Srinivas, Sub Editor

## సంపాదకీయం

## కార్యకర్తల్లో నూతనోత్సాహం

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, గోదావరి, ఉత్తరాంధ్ర, రాయలసీమ జోన్ల వారీగా నిర్వహించిన ప్రశిక్షణ శిబిరాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపడమే కాకుండా, రాబోయే రాజకీయ ప్రస్థానానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశాయి. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్, ఇతర సీనియర్ నాయకులు ఉద్ఘాటించినట్లుగా, భాజపా కేవలం అధికార దాహంతో నడిచే శక్తి కాదు. దేశ భద్రతకు, సమగ్రతకు పెద్దపీట వేసే ఒక భావజాల ప్రవాహం.

గడిచిన 12 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారతదేశం అవినీతిరహిత, పారదర్శక పాలనను రుచి చూస్తోంది. అభివృద్ధిని నిరంతరం కొనసాగిస్తూనే, 'విశ్వ గురువు'గా భారత్ ప్రపంచ వేదికపై తన సత్తా చాటుతోంది. ఈ విజయాలే రాబోయే రోజుల్లో కార్యకర్తలకు ప్రధాన అస్త్రాలు కావాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న వేల కోట్ల నిధులు, అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలదే. ప్రజలకు వాస్తవాలు తెలిసినప్పుడే, క్షేత్రస్థాయిలో పార్టీకి, కూటమికి తిరుగులేని మద్దతు లభిస్తుంది. కార్యకర్తలు కేవలం జెండా మోసేవారుగా కాకుండా, కేంద్ర పథకాలకు, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేయాలని, రాజ్యాంగ పదవులు పొంది ప్రజాసేవ చేయాలనేది అధ్యక్షులు మాధవ్‌గారి అభిలాష.

అందుకే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. పార్టీ పటిష్టతకు, కూటమి ప్రభుత్వ స్థిరత్వానికి ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారానే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మనం ప్రభావితం చేయగలం. అయితే, ఈ పోరాటంలో మనవ్యూహం "కూటమిధర్మం" ఆధారంగా ఉండాలని నాయకత్వం స్పష్టంచేసింది. టికెట్ల కేటాయింపు విషయంలో వ్యక్తిగత పంతాలకు, భేషజాలకు పోకుండా, కూటమిలోని మూడు పార్టీలమధ్య సమన్వయం లోపించకుండా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యతగా వివరించారు. నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా అందరూ ఒకే తాటిపై నడిచి, ఐకమత్యంతో ముందడుగు వేస్తేనే మన లక్ష్యం సాధించగలమని దిశానిర్దేశం చేశారు.

# సేవే భారతీయ నాగరికత మూలం

## భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతోత్సవాల్లో ప్రధాని మోడీ ప్రసంగం



ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంత్యుత్సవాల సందర్భం గా భక్తకోటిని ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ నవంబరు 19న ప్రసంగించారు.

'సాయిరాం' అంటూ ప్రసంగాన్ని మొదలుపెట్టిన ప్రధానమంత్రి.. ఈ పవిత్ర పుట్టపర్తి క్షేత్రంలో భక్తులందరి నడుమ ఉండడం ఒక భావోద్వేగ భరిత, ఆధ్యాత్మిక అనుభవమని పేర్కొన్నారు. కొద్దిసేపటి కిందటే బాబా సమాధి వద్ద పుష్పాంజలి ఘటించే అవకాశం తనకు దక్కిందన్నారు. బాబా పాదాలకు నమస్కరించి, ఆయన ఆశీస్సులను పొందినట్లు చెప్పారు. బాబా ఆశీస్సులు ఎప్పుడు అందించినా మనసు భావోద్వేగానికి లోనవుతుందని శ్రీ మోడీ వ్యాఖ్యానించారు. శ్రీ సత్యసాయి బాబా శతజయంతి సంవత్సరం ఈ తరానికి ఒక వేడుక మాత్రమే కాదని, దైవాశీర్వాదమని శ్రీ మోడీ అన్నారు. బాబా ఇప్పుడు భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన బోధనలు, ప్రేమ, సేవా స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ కొత్త వెలుగు, మార్గనిర్దేశం, సంకల్పంతో.. 140కి పైగా దేశాల్లో లెక్కకు మిక్కిలి భక్తులు జీవితంలో ముందుకు సాగుతున్నారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

వసుధైక కుటుంబమన్న ఆదర్శానికి శ్రీ సత్య సాయిబాబా జీవితం సజీవ ఉదాహరణగా అభివర్ణించిన ప్రధానమంత్రి.. 'అందుకే ఈ శత జయంతి సంవత్సరం విశ్వవ్యాప్త ప్రేమ, శాంతి, సేవా పర్వంగా మారింది" అని వ్యాఖ్యా



నించారు. బాబా సేవా పరంపరను ప్రతిబింబించేలా ఈ సందర్భంగా రూ. 100 స్మారక నాణేన్నీ, తపాలా బిళ్ళనీ విడుదల చేయడం ఈ ప్రభుత్వం చేసుకున్న అదృష్టమన్నారు. భక్తులకు, తోటి వలంటీర్లకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాబా అను చరులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



"సేవే భారతీయ నాగరికతకు మూలం" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. భారత్‌లోని వివిధ ఆధ్యాత్మిక, తాత్విక సంప్రదాయాలన్నింటికీ సేవే అంతిమ గమ్యమని స్పష్టం చేశారు. భక్తి, జ్ఞానం, కర్మ... ఏ మార్గంలో నడిచినా సరే, అవన్నీ సేవతో అనుసంధానమయ్యే ఉంటాయి. "సమస్త జీవరాశుల్లో కొలువై ఉన్న దైవానికి సేవ లేకుండా భక్తికి అర్థం లేదు. ఇతరుల పట్ల కారుణ్య భావాన్ని మేల్కొల్పలేనిది జ్ఞానం ఎలా అవుతుంది? తన పనిని సమాజ సేవగా సమర్పించే స్ఫూర్తి లేకపోతే అది కర్మ ఎలా అవుతుంది" అని ఆయన ప్రశ్నించారు. "సేవా పరమో ధర్మః- ఎన్నో మార్పులు, సవాళ్ల నడుమ శతాబ్దాలుగా భారత్‌ను సుస్థిరంగా నిలిపిన భావన ఇదే. ఇది మన నాగరికతకు అంతర్గత బలాన్నిస్తోంది" అని శ్రీ మోడీ పేర్కొన్నారు. ఎందరో గొప్ప సాధువులు, సంస్కర్తలు తమ కాలానికి అనుగుణంగా.. కాలాతీతమైన ఈ సందేశాన్ని ముందుకు తీసుకెళ్లారని వ్యాఖ్యానించారు. సేవే మానవ జీవన కేంద్రంగా శ్రీ సత్య సాయిబాబా చూశారని ప్రధానమంత్రి కొనియాడారు. "అందరినీ ప్రేమించండి, అందరినీ సేవించండి" అన్న బాబా మాటలను గుర్తు చేసిన ఆయన.. బాబా దృష్టిలో ప్రేమకు ఆచరణ రూపమే సేవ అని స్పష్టం చేశారు. విద్య, ఆరోగ్య రక్షణ, గ్రామీణాభివృద్ధి, ఇంకా అనేక ఇతర రంగాల్లో ఉన్న బాబా సంస్థలు ఈ తాత్వికతకు సజీవ నిదర్శనమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆధ్యాత్మికత, సేవ రెండూ వేర్వేరు కావనీ- అవి ఒకే సత్యానికి భిన్నమైన వ్యక్తీకరణలుగా ఈ సంస్థలు చాటుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. భౌతికంగా వారిక్కడే ఉన్నప్పుడు ప్రజలకు స్ఫూర్తినివ్వడం అసాధారణమేమీ కాదనీ, అయితే బాబా భౌతికంగా ఇక్కడ లేనప్పటికీ ఆయన సంస్థల సేవా కార్యకలాపాలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయని శ్రీ మోడీ చెప్పారు. నిజమైన మహనీయుల ప్రభావం కాలం గడిచిన కొద్దీ తగ్గిపోదనీ, నిజానికి అది రోజురోజుకూ మరింత పెరుగుతుందనడానికి ఇదే నిదర్శనమనీ ఆయన వ్యాఖ్యానించారు.



శ్రీ సత్య సాయిబాబా సందేశం ఎప్పుడూ పుస్తకాలకు, ఉపన్యాసాలకు, ఆశ్రమ సరిహద్దులకు పరిమితం కాలేదనీ.. ఆయన బోధనల ప్రభావం ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందని శ్రీ మోడీ



వ్యాఖ్యానించారు. నగరాల నుంచి మారుమూల గ్రామాల వరకు, పాఠశాలల నుంచి గిరిజనావాసాల వరకు.. దేశవ్యాప్తంగా సంస్కృతి, విద్య, వైద్య సేవల అద్భుత వాహిని ప్రవహిస్తోందన్నారు. లక్షలాది మంది బాబా అనుచరులు నిస్వార్థంగా ఈ పనిలో నిమగ్నమై ఉన్నారని ప్రశంసించారు. 'మానవ సేవే మాధవ సేవ' భావనే బాబా భక్తులకు అత్యున్నత ఆదర్శమని ఆయన

## పుట్టపర్తిలో ప్రధాని మోడీ

స్పష్టం చేశారు. కరుణ, కర్తవ్యం, క్రమశిక్షణ, జీవన తాత్వికతా సారం వంటి అనేక భావనలను బాబా బోధించారని ప్రధానమంత్రి చెప్పారు. 'ఎప్పుడూ సాయమే అందించు, ఎన్నడూ నొప్పించకు', 'తక్కువ మాట్లాడు, ఎక్కువ పనిచేయి'... అన్న బాబా మార్గదర్శక సూత్రాలను ఆయన గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి బాబా ప్రవచించిన ఆ జీవన మంత్రాలు అందరి హృదయాల్లో నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయని స్పష్టం చేశారు.

ఆధ్యాత్మికతను- సమాజం, ప్రజా సంక్షేమం కోసం శ్రీ సత్య సాయిబాబా ఉపయోగించారన్న ప్రధానమంత్రి.. నిస్వార్థ సేవ, వ్యక్తిత్వ నిర్మాణం, విలువలతో కూడిన విద్యతోనే ఇది సాధ్యపడిందన్నారు. బాబా ఏ సిద్ధాంతాన్నీ, భావజాలాన్నీ ప్రజలపై రుద్దలేదనీ.. పేదలకు సాయమందించేందుకు, వారి బాధలను తగ్గించేందుకు కృషి చేశారని ఆయన స్పష్టం చేశారు. గుజరాత్ భూకంపం అనంతరం బాబా సేవా దళ్ సహాయక చర్యల్లో ముందుండి నడిచిందని శ్రీ మోడీ గుర్తు చేసుకున్నారు. ఆయన అనుచరులు చాలా రోజులు పూర్తి అంకితభావంతో పనిచేశారు. బాధిత కుటుంబాలకు సాయమందించడంలో, అత్యవసర సామగ్రిని అందించడంలో, మానసిక చేయూతనివ్వడంలోనూ విశేషంగా కృషి చేశారు.

ఎవరినైనా ఒక్కసారి కలిస్తే మన హృదయం కరుగుతోందంటే... జీవన దశను మారుస్తోందంటే.. అది ఆ వ్యక్తి గొప్పతనానికి నిదర్శనమని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. బాబా సందేశంతో తమ జీవితాల్లో గొప్ప మార్పు





## పుట్టపర్తిలో ప్రధాని మోడీ

ను పొందిన వ్యక్తులు ఈ వేడుకలో పాల్గొన్న వారిలో కూడా అనేకులు ఉన్నారన్నారు.

శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు, దాని అనుబంధ సంస్థలు శ్రీ సత్యసాయి బాబా స్ఫూర్తి తో వ్యవస్థీకృతమైన, సంస్థాగతమైన, స్థిరమైన పద్ధతిలో సేవలు అందిస్తున్నాయని, ఇది ఆచరణాత్మక విధానానికి ఇది ఉదాహరణగా మారిందని శ్రీ మోడీ సంతృప్తి వ్యక్తం చేశారు. నీరు, గృహ నిర్మాణం, పోషకాహారం, విపత్తు సాయం, స్వచ్ఛ ఇంధనం లాంటి రంగాల్లో విశేషమైన కృషి చేస్తోందని కొనియాడారు. ట్రస్టు చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలను ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాయలసీమలో తాగునీటి కొరతను తీర్చేందుకు 3,000 కి.మీ పైగా పైపులైన్లను వేసింది. ఒడిశాలో వరద బాధిత కుటుంబాల కోసం 1,000 ఇళ్లను నిర్మించింది. పేదలు కోసం బిల్లింగ్ కౌంటర్లు లేని ఆసుపత్రులను నిర్వహిస్తోంది. ఉచితంగా చికిత్స అందిస్తున్నప్పటికీ.. రోగులకు, వారి కుటుంబాలకు ఇక్కడ ఎలాంటి అసౌకర్యం కలగదని ఆయన అన్నారు. బాలికలకు విద్యను, భద్రమైన భవిష్యత్తును అందించడానికి.. వారి పేరు మీద ఈ రోజు 20,000కు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిచారని ప్రధాని వెల్లడించారు.

బాలికలకు విద్యను, ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు పదేళ్ల కిందట భారత ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజనను ప్రారంభించిందని తెలియజేశారు. మన దేశంలోని అమ్మాయిలకు అత్యధికంగా 8.2 శాతం వడ్డీ రేటును అందించే కొన్ని పథకాల్లో ఇది కూడా ఒకటని శ్రీ మోడీ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా ఖాతాలను తెరిచారని, వీటిలో ఇప్పటివరకు దాదాపుగా రూ. 3.25 లక్షల కోట్లకు పైగా మొత్తాన్ని పొదుపు చేశారని ఆయన వెల్లడించారు. ఇక్కడ 20,000 సుకన్య సమృద్ధి ఖాతాలను తెరిచిన శ్రీ సత్య సాయి కుటుంబాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. తన నియోజక వర్గం వారణాసి గురిం





చి ప్రస్తావిస్తూ.. గతేడాది ఫిబ్రవరిలో 27,000 సుకన్య సమృద్ధి ఖాతాలను తెరిచామని, ప్రతి ఖాతాలోనూ రూ.300 జమ చేసినట్లు వివరించారు. అమ్మాయిలకు విద్యను, ఉజ్వలమైన భవిష్యత్తును అందించడంలో సుకన్య సమృద్ధి యోజన గణనీయమైన పాత్ర పోషిస్తుందని హామీ ఇచ్చారు.

గడచిన పదకొండేళ్లలో ప్రారంభించిన వివిధ పథకాలు ప్రజల సామాజిక భద్రతా విధానాన్ని గణనీయంగా బలోపేతం చేశాయని ప్రధానమంత్రి అన్నారు. సామాజిక భద్రత పరిధిలోకి వస్తున్న పేదలు, అణగారిన వర్గాలను వేగంగా తీసుకువస్తున్నారని ఆయన వివరించాంం. 2014లో కేవలం 25 కోట్ల మందికి మాత్రమే ఈ ప్రయోజనాలు దక్కితే.. ఇప్పుడు ఆ సంఖ్య 100 కోట్లకు చేరుకుంది. భారత్‌లో అమలు చేస్తున్న సంక్షేమ, సామాజిక భద్రతా పథకాల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చిస్తున్నారని శ్రీ మోడీ తెలియజేశారు.

ఈ రోజు ట్రస్టు ద్వారా పేద వ్యవసాయ కుటుంబాలకు 100 ఆవులను అందించిన గోదాన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తనకు లభించిందని శ్రీ మోడీ అన్నారు. భారతీయ సంప్రదాయంలో ఆవును జీవితానికి, సంక్షేమానికి, కరుణకు ప్రతీకగా భావిస్తామని వివరించారు. ఈ కుటుంబాలు ఆర్థిక, పోషకాహార, సామాజిక స్థిరత్వాన్ని సాధించడానికి ఈ ఆవులు తోడ్పడతాయి. గో సంరక్షణ ద్వారా అందించే

## పుట్టపర్తిలో ప్రధాని మోడీ

సంక్షేమం అనే సందేశాన్ని ప్రపంచమంతా వీక్షిస్తోందని ప్రధాని అన్నారు. కొన్నేళ్ల కిందట వారణాసిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా 480కు పైగా గిర్ ఆవులను పంపిణీ చేశామని.. ఇప్పుడు అక్కడ గిర్ ఆవులు, లేగదూడల సంఖ్య దాదాపుగా 1,700కు పెరిగిందన్నారు. పంపిణీ చేసిన ఆవుకు దూడ పుడితే దానిని ఇతర ప్రాంతాల్లోని రైతులకు ఉచితంగా అందించే సరికొత్త సంప్రదాయం వారణాసిలో మొదలైందని, తద్వారా గో సంతతి పెరుగుతుందని ఆయన వెల్లడించారు. ఏడెనిమిదేళ్ల కిందట ఆఫ్రికాలోని రువాండాలో తన పర్యటన సందర్భంగా 200 గిర్ ఆవులను ఆ దేశానికి భారత్ బహుమతిగా అందించిందని గుర్తు చేశారు. రువాండాలో సైతం "గిరింకా" పేరుతో ఇదే తరహా సంప్రదాయం ఉందన్నారు. "మీకు కూడా ఓ ఆవు ఉండాలి" అని దీని అర్థం. అక్కడ ఆవుకు జన్మించిన మొదటి పెయ్య దూడను పొరుగున ఉండే కుటుంబానికి ఇస్తారు. ఇది రువాండాలో పోషకాహారం, పాల ఉత్పత్తి, ఆదాయం, సామాజిక ఐక్యతను మెరుగుపరిచింది.

భారతీయ గిర్, కంక్రేజ్ జాతులను స్వీకరించి వాటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ నిర్వహణ ద్వారా అత్యుత్తమమైన పాడి పశువులుగా బ్రెజిల్ మలిచిందని ప్రధాని అన్నారు. ఈ ఉదాహరణలు సంప్రదాయం, కరుణ, శాస్త్రీయ ధోరణి కలసి ఆవును విశ్వాసం, సాధికారత, పోషకాహారం, ఆర్థిక ప్రగతికి ప్రతీకగా ఎలా మార్చవచ్చో వివరిస్తాయన్నారు. గొప్ప ఉద్దేశంతో ఈ సంప్రదాయాన్ని ఇక్కడ





ముందుకు తీసుకెళుతుండటంపట్ల సంతోషం వ్యక్తంచేశారు.

అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశం "కర్తవ్య కాలం" అనే స్ఫూర్తితో ముందుకు సాగుతోందని, ఈ లక్ష్య సాధనకు ప్రతి పౌరుడి చురుకైన భాగస్వామ్యం అవసరమని శ్రీ మోడీ స్పష్టం చేశారు. ఈ ప్రయాణంలో శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలు ప్రధాన స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ ప్రత్యేక సంవత్సరంలో "ఓకల్ ఫర్ లోకల్" మంత్రాన్ని బలోపేతం చేయాలని, అభివృద్ధి చెందిన భారత్‌ను

## పుట్టపర్తిలో ప్రధాని మోడీ

సాధించడానికి అవసరమైన స్థానిక ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాలని అందరికీ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఉత్పత్తులను కొనడం ద్వారా నేరుగా ఓ కుటుంబం, ఓ చిన్న వ్యాపార సంస్థ, స్థానిక సరఫరా వ్యవస్థను నేరుగా శక్తిమంతం అవుతాయని.. ఆత్మనిర్భర భారత్‌కు మార్గం సుగమం అవుతుందన్నారు.



ఈ కార్యక్రమానికి హాజరైన వారంతా శ్రీ సత్య సాయి బాబా స్ఫూర్తితో జాతి నిర్మాణానికి నిరంతరాయంగా తమ వంతు తోడ్పాటు అందిస్తున్నారని శ్రీమోడీ అంగీకరించారు. ఈ పవిత్ర భూమికి నిజంగా ఓ ప్రత్యేక శక్తి ఉందని – ప్రతి భక్తుని మాటలోనూ దయ, ఆలోచనల్లో శాంతి, చేతల్లో సేవ ప్రతిఫలిస్తున్నాయన్నారు. ఎక్కడైనా నష్టం లేదా బాధ ఉంటే.. అక్కడ ఆశా కిరణంలా భక్తులు నిలబడతారన్నారు. ఈ స్ఫూర్తితో ప్రేమ, శాంతి, సేవ అనే పవిత్ర కార్యాన్ని ముందుకు తీసుకెళుతున్నందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీ సత్యసాయి కుటుంబానికి, సంస్థలకు, స్వచ్ఛంద సేవకులకు, భక్తులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ.. ప్రసంగాన్ని ముగించారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు శ్రీ కే రామ్మోహన్ నాయుడు, శ్రీ జీ కిషన్ రెడ్డి, శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


Sukanya Samriddhi Account











INDIAN MUSICAL HOUSE


# బిర్సాముండా ఉద్యమ స్ఫూర్తితో ఆదివాసీల అభ్యున్నతికి కృషి



**● భగవాన్ బిర్సాముండా విగ్రహా విష్కరణ సభలో ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ వెల్లడి**

దేశ స్వాతంత్ర్యం కోసం, అటవీ హక్కుల కోసం భగవాన్ బిర్సాముండా చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శం కావాలని, ఆయన ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలని ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో 'జన జాతీయ గౌరవ దివాస్' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భగవాన్ బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఒడిశా సీఎం, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా శ్రీ మోహన్ చరణ్ మాఝీ, స్థానిక గిరిజన దేవత మోదుకొండమ్మకు భక్తిపూర్వకంగా నమస్కరించి, జిల్లా ప్రజలందరికీ తెలుగులో శుభాకాంక్షలు తెలిపి ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం 25 ఏళ్ల ప్రాయంలోనే భగవాన్ బిర్సాముండా ఆదివాసీల హక్కుల కోసం, వారి సంస్కృతీ సంప్రదాయాల కోసం బ్రిటిష్ వారితో పోరాడి అమరుడయ్యారని కొనియాడారు. బిర్సాముండా ఆదివాసీల పాలిట దైవంగా నిలిచారని, ఆయన త్యాగాలకు గుర్తింపుగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయన జయంతిని 'జన జాతీయ గౌరవ దివాస్'గా ప్రకటించడమే



కాకుండా, 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేయడం గర్వకారణమన్నారు. అదేవిధంగా, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంధ్రప్రదేశ్ ఆత్మ గౌరవానికి ప్రతీక అని సీఎం మోహన్ చరణ్ అభివర్ణించారు. ఆదివాసీల్లో చైతన్య జ్వాలలు రగిలించి, వారిని ఏకం చేసి రంపలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని, ఆయన ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కీర్తించారు.



## గిరిజనులకు పట్టం

గత ప్రభుత్వాలు గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని, కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాకే వారికి నిజమైన గౌరవం, ఉపాధి లభించాయని మాఝీ స్పష్టం చేశారు. గిరిజన బిడ్డ ద్రౌపది ముర్మును దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టడం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో గిరిజనులను ముఖ్యమంత్రులుగా చేయడం బీజేపీ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన వైభవం

ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తెగల వైవిధ్యం అద్భుతమని సీఎం మోహన్ చరణ్ కొనియాడారు. వ్యవసాయం చేస్తూ ప్రకృతిని ప్రేమించే జటాపులు, పోరాట పటిమతో పాటు అటవీ సంపదను సమాజానికి అందించే కొండదొరలు, గిరిజన భాషను, చిత్రలేఖనాన్ని కాపాడుతున్న సవరలు, ప్రత్యేక వేషధారణతో అలరించే గదబలు, ఈ ప్రాంతంలో ప్రాధాన్యత కలిగిన వాల్మీకి తెగలు... ఇలా ఎన్నో తెగలు భారతీయ సంస్కృతికి వన్నె తెస్తున్నాయని ప్రశంసించారు.

## గిరిజన సంక్షేమానికి కేంద్రం పెద్దపీట:

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్పష్టం చేశారు. 'పీఎం ధర్తీ ఆబా ట్రైబల్ విలేజ్ ఎక్సలెన్స్ మిషన్' ద్వారా రూ.80 వేల కోట్ల భారీ నిధులతో 63 వేల ఆదివాసీ గ్రామాల్లోని 5 కోట్ల మంది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 6,700 గ్రామాల్లో 90 వేల ఇళ్లకు





తాగునీరు, వెయ్యి కొత్త అంగన్‌వాడీలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏపీలోని సవర, గదబ వంటి తెగలు ఈ పథకాలద్వారా లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఏకలవ్య పాఠశాలలను 119 నుంచి 497కు పెంచామని, ఉపకారవేతనాల నిధులను 300 శాతం పెంచామని వివరించారు. సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. గిరిజన యువత స్వావలంబన కోసం రూ.16,650 కోట్ల రుణాలు, వన్‌ధన్ కేంద్రాల ద్వారా అటవీ ఉత్పత్తుల విలువల పెంపు, 24 లక్షల కుటుంబాలకు అటవీ హక్కు పత్రాలు అందించామని తెలిపారు. అరకు, కోరాపుట్ కాఫీలకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని, లంబసింగిలో గిరిజన మ్యూజియం నిర్మిస్తున్నామని చెప్పారు. తూర్పు కనుమల గిరిజనులు దేశానికి హృదయం వంటివారని, యువత భగవాన్ బిర్సాముండాను స్ఫూర్తిగా తీసుకుని మోదీ బాటలో 'ఒక దేశం–ఒక భవిష్యత్' నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



## పర్యావరణ రక్షకులు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, కాలుష్య రహిత జీవనం గడపడం, ప్రకృతిని పూజించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడమే నిజమైన గిరిపుత్రుల లక్షణమని గుర్తుచేశారు. ఇటువంటి ఆదర్శ జీవనం గిరిజన సమాజం నుంచి మనందరికీ బోధపడుతుందని పేర్కొన్నారు. ఆదివాసీ వీరుడు భగవాన్ బిర్సా ముండా ఆశయాలను గిరిజనులు ఇప్పటికీ పుణికిపుచ్చుకుని జీవిస్తున్నారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరంలో ఎంతోమంది యోధులు ప్రాణాలర్పించారని, కానీ గతంలో ఒకే కుటుంబం మాత్రమే ఆ చరిత్రను దాచిపెట్టి, తమకు అనుకూలంగా చిత్రీకరించిందని విమర్శించారు. ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆ వీరులకు నిజమైన గౌరవం తెచ్చే ప్రయ




త్వం చేస్తోందని, గిరిజన సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. గిరిజనుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని, గత ప్రభుత్వాలు కనీసం పోడు భూమి హక్కులు కూడా కల్పించలేకపోయాయని ఆరోపించారు. కేంద్రం కేటాయించిన వైద్య కళాశాలలు, బోధ నాసుపత్రులను గత వైకాపా ప్రభుత్వం నిర్మించ లేదని, కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం పాడేరు లో అత్యాధునిక గిరిజన వైద్య కళాశాలను నిర్మించిందని, త్వరలో పార్వతీపురంలో మరొకటి ప్రారంభమవుతుందని హామీ ఇచ్చారు.

## గిరిజనుల ఆత్మగౌరవ స్ఫూర్తి

ఆంధ్రప్రదేశ్ భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి.వి. ఎన్. మాధవ్ మాట్లాడుతూ, ఒడిశా ముఖ్యమం త్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ. పాడేరు వచ్చి బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నా రు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసి న గిరిజన వీరులను ఈ సందర్భంగా స్మరించు కుంటున్నామని భావోద్వేగంతో అన్నారు. గిరిజ నుల అస్తిత్వం, హక్కుల కోసం భగవాన్ బిర్సా ముండా బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా ధీరంగా పోరాడారని గుర్తుచేశారు. ఆయన ఆరోజు చేసిన పోరాట ఫలితంగానే ఇప్పుడు 1/70 చట్టం, పిసా చట్టం, ఫారెస్ట్ రైట్స్ యాక్ట్, ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్ వంటి రక్షణ చట్టాలు అమలవుతున్నాయని వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ గారి జనమన్ పథకం ద్వారా దేశంలోని 43 అత్యంత వెనుకబడిన గిరిజన తెగలకు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు అందు తున్నాయని, అందులో ఆంధ్రప్రదేశ్‌లోని 4 ప్రత్యేక వెనుకబడిన తెగలు కూడా ఉన్నాయని తెలిపారు. వీరికి 4 వేలకు పైగా గృహాలు, విద్యా–ఆరోగ్య సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని హామీ ఇచ్చారు. విదేశీ శక్తులు ఇప్పటికీ మన దేశంపై దాడులు చేస్తున్నాయని, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మతతత్వం కారణంగా







గిరిజనులు తమ హక్కులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో మోడీ గారు కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేయడం ద్వారా అక్కడి గిరిజనులకు సమాన హక్కులు కల్పించారని కొనియాడారు. మతమౌఢ్యం, మతమార్పిడి ద్వారా మన సంస్కృతి-సంప్రదాయాలను నాశనం చేయాలని చూస్తున్న శక్తులను గిరిజన సోదరులు ధైర్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమం సహకారంతో ప్రతి గ్రామం, ప్రతి తాండాలోనూ జనజాతి గౌరవ దివస్‌ను ఘనంగా నిర్వహించాలని, బిర్సా ముండా ఆశయాలను కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

## గిరిజనులకు అత్యున్నత పదవులు

రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యరాణి మాట్లాడుతూ గిరిజనుడికి రాష్ట్ర ముఖ్య మంత్రిగా చేసిన ఘనత కూటమిదన్నారు. ఎన్ఆర్‌జిఈఎస్ లో నిధులు వస్తున్నాయి అంటే కేంద్రం సహకరిస్తోందన్నారు. పార్వతీపురం సాలూరు నియోజక వర్గాల్లో 21 గ్రామాల్లో సమస్యలున్నాయి. ఒడిసా రాష్ట్రం పరిష్కరించాలని కోరారు.







ముందుగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ. ఇతర నేతలు చింతల వీధి గ్రామంలో బిర్సాముండా విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభా ప్రాంగ ణం వద్ద ప్రదర్శించిన జిసిసి, వందన్ వికాస్ స్టాల్స్ ను సందర్శించారు. గిరిజనులతో కలసి గిరిజన నృత్యం వేశారు.

కార్యక్రమంలో భాజపా ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం అధ్యక్షులు మఠం సన్యాసినాయుడు, భాజపా జిల్లా అధ్యక్షులు, సర్పంచ్ శాంతకుమారి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోలాబుజ్జి రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే బిజెపి అధ్యక్షులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ ఆత్మ వందేమాతరం




## కాకినాడ లో 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు

'వందేమాతరం అనేది కేవలం ఒక గీతం కాదు, అది భారతదేశ ఆత్మగా భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు శ్రీ రాధామోహన్ దాస్ అగర్వాల్ అభివర్ణించారు. 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను నవంబరు 7న కాకినాడ లోని గాంధీనగర్ పార్కులో నిర్వహించారు. వందేమాతర గేయాన్ని విష్ణు దిగంబర్ పులస్కర్ ఆలపిస్తుండగా మహ్మద్ అలీ అడ్డుకున్న ఘట్టం తోపాటు స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలోని కొన్నిసన్నివేశాలను నాటికల రూపంలో ముందుగా ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాధామోహన్‌దాస్ మాట్లాడుతూ, "వందేమాతరం అనేది కేవలం ఒక గీతం కాదు, అది భారతదేశ ఆత్మ. స్వాతంత్ర్య పోరాటంలో జాతిని ఏకం చేసిన నినాదంగా పేర్కొన్నారు. దీనిని రాజకీయాల కోసం వాడుకోవడం దురదృష్టకరమని ఆవేదన చెందారు. మతపరమైన కోణంలో చూడటం జాతి సమగ్రతకు ప్రమాదం" అని హెచ్చరించారు. వందేమాతరాన్ని గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని సూచించారు. ఒకనాడు వందేమాతరాన్ని అవమానించిన కాకినాడలో నేడు ఆ గేయాన్ని పూర్తిగా ఆలపించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్యనికి పూర్వం కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహా సభ(1923)లో వందేమాతర గేయాన్ని ఆలపించకుండా నాటి కాంగ్రెస్ నాయకులు అవమానించారు. అప్పట్లో కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షత వహించిన ఉన్న మౌలానా మహమ్మద్ అలీ.. వందేమాతరం ఆలపిస్తుండగా అభ్యంతరం వ్యక్తంచేసి, వెళ్లిపోయారు. అలాంటి చోట మళ్లీ వందల మందితో కలిసి పూర్తి గేయాన్ని ఆలపించడం మనసును పులకింపజేస్తోంది. అదే స్థలంలో ఈ వేడుక నిర్వహించడం అభినందనీయమన్నారు. నిజమైన వేడుకలు కాకినాడలోనే జరిగాయని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాకినాడలో అఖిల భారత్ కాంగ్రెస్ మహాసభలు వందేమాతరం గీతాన్ని గాయపరిచిన కాంగ్రెసు



కు బుద్ధి వచ్చేలా కాకినాడలో కార్యక్రమం ఏర్పాటు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను అభినందించారు. అనంతరం గాంధీనగర్ పార్కు ఎదురుగా మౌలానా మహమ్మద్ అలీ రోడ్డును 'వందేమాతరం మార్గ్‌గా మారుస్తూ అతిథులు బోర్డు ఆవిష్కరించారు. బ్రిటిషర్లు గాడ్ సేవ్ ద కింగ్ అనే గీతాన్ని భారతీయులు ఆలపించమంటే దానికి ప్రతిగా భారతమాతను స్తుతించే "వందేమాతరం" గీతాన్ని స్వాతంత్ర్య సమరయోధులు ఆలపించారన్నారు. ఇందులో తప్పేం ఉందని రాధామోహన్‌దాస్ ప్రశ్నించారు. బెంగాల్‌ను మతపరంగా బ్రిటిషర్లు విడదీసే ప్రయత్నం చేస్తే మొత్తం బెంగాల్ ప్రజలు వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఇలా ఈ ఉద్యమం దేశం మొత్తం విస్తరించిందని గుర్తుచేశారు. ఈ గీతం ద్వారా దేశం అంతా సమైక్యంగా నిలిచి స్వాతంత్ర్యం కోసం పోరాడి సాధించారని కాని నేడు కాంగ్రెస్, కమ్యూనిస్టు, వాటి మిత్ర పక్షాలు కుహనా లౌకిక పార్టీల ముసుగులో కొన్ని వర్గాలను సంతృప్తి పరచేందుకు ఈ గీతాన్ని మతపరమైన దృష్టితో చూస్తున్నాయని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గీతాలను, జాతీయ చిహ్నాలను అవమానించే ధోరణి పెరిగిపోతుందని కేరళ, కర్నాటక రాష్ట్రాలను ఉద్దేశించి విమర్శించారు.



"కేరళలో కొన్ని వర్గాలను సంతృప్తి పరచడానికి అక్కడి ప్రభుత్వాలు 'వందేమాతరం' ఆలపించడానికి వెనుకాడుతున్నాయి."అని పేర్కొన్నారు. "కర్ణాటకలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా కేరళ బాటలోనే పయనిస్తూ, దేశభక్తికి సంబంధించిన అంశాలను పక్కనబెట్టి, మతతత్వ రాజకీయాలకు ఊతమిస్తోంది." ఇటువంటి చర్యలు దేశ భద్రతకు, ఐక్యతకు ముప్పు అని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం జాతీయ గీతమైన వందేమాతరాన్ని అవమానించడాన్ని బీజేపీ ఎన్నటికీ సహించదు. ఈ చర్యలను దేశ ప్రజలంతా ఖండించాని కోరారు. ఈ రెండు రాష్ట్రాల్లో జాతీయ భావజాలంపై జరుగుతున్న దాడిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు గమనించాలని కోరారు. దేశం కోసం, ధర్మం కోసం నిలబడే భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

## వందేమాతరం.. ఉద్యమ కెరటం : భాజపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ పీవిఎన్ మాధవ్

కాకినాడకు వందేమాతర గీతానికి ఉన్న సంబంధాన్ని పార్టీ కేంద్ర పెద్దల దృష్టికి తీసకురావడంతో భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు శ్రీ రాధామోహన్‌దాస్ అగర్వాల్ గారిని ఇక్కడకు పంపారు. ఆయన ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి



ఎమ్మెల్యేగా 25 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడా నియోజకవర్గం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ గెలిచారన్నారు. బకించంద్ర చటోపాద్యాయ రచించిన వందేమాతరం గీతం భారతీయులందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ గీతం ఆనాటి భారతీయుల్లో స్వతంత్ర్య సంగ్రామ స్ఫూర్తిని రగిల్చిందన్నారు. 1905 బెంగాల్ విభజనకు ప్రయత్నించిన బ్రిటీష్ పాలకులపై పోరాటానికి ఉత్తేజం కలిగించిందన్నారు. భారత జాతిని ఏకతాటిపైకి తెచ్చిందన్నారు. ఈ పోరాట వత్తిడితో 1911లో బ్రిటిషర్లు బెంగాల్ విభజనను వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. కాని 1923 కాంగ్రెస్ కమిటీ సమావేశం కాకినాడలో ఇదే ప్రదేశంలో  పులుసు సాంబమూర్తి, కొండ వెంకట పంతులు, ప్రకాశం పంతులు గారి ఆధ్వర్యంలో జరిగింది. నాటి కాంగ్రెస్ అధ్యక్షులు మౌలానా మహమ్మద్ అలీ, సభ ప్రారంభించే ముందు వందేమాతర గీతం పాడారు. విష్ణుదిగంబర్ పులస్కర్ పాడుతూంటే ముస్లింకు వ్యతిరేకంగా ఉందని పేర్కొంటూ వందేమాతరాన్ని వ్యతిరేకించారు. నాటి ముస్లిం నాయకులు ఆ వ్యాఖ్యలను వ్యతిరేకించినా తమ్ముడు షౌకత్ అలీతో కలసి మహ్మద్ అలీ సభనుంచి వెళ్లిపోయాడు.  కాని పులస్కర్ ఆ గీతాన్ని రాగయుక్తంగా పాడుతూ  అందరిలో ఉత్సాహం నింపారు. ఈ గీతాన్ని పాడితే తాము ముస్లింలీగ్‌లో చేరతామని అలీ సోదరులు బెదిరించారు. అప్పటి నుంచి కాంగ్రెస్ ఈ గీతాన్ని పాడరాదని నిర్ణయించింది. ఆ నిర్ణయం కారణంగానే 1947లో దేశ విభజన జరిగింది. హిందువులు, ముస్లింలు వేరనే అభిప్రాయం నేటికి  కలిగించే ప్రయత్నాన్ని కాంగ్రెస్, కమ్యూనిస్టు కుహనా లౌకిక నాయకులు చేస్తున్నారు. తప్పనిసరిగా దీనికి వందేమాతరం ద్వారా సమాధానం ఇవ్వాలి. వందేమాతరం గీతం పాడుతుంటే ఇప్పటికీ నరనరానా ఉద్వేగం ఉప్పొంగుతుందన్నారు. రక్తంలో దేశభక్తి రగిలిపోతుందన్నారు. ఎవరే మతాన్ని అవలబంభించినా తప్పులేదు కాని మా మతమే గొప్ప, ఇతర మతాలు తప్పనే అభిప్రాయం ఈ దేశంలో అంగీకారం కాదు. ఈ గీతం అర్థం అందరినీ ఐక్యంగా ఉంచడమే. విభజనకు కారణమైన అలీ పేరు నేటికి ఈ వీధికి ఉండటంతో దానిని మార్చివేయడం జరిగింది. విదేశీయులకు గొప్పలు ఆపాదించడ, మనం తక్కువగా చూసుకోవడం మనలో నుంచి తొలగించాలి. స్వరాజ్యానికి, స్వధర్మానికి, స్వభాషకు మనం గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రధాని మోడీ ఆత్మనిర్భర్ భారత్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారత్‌కు పురాతనంగానే గొప్ప సంస్కృతి ఉంది. మనం ఆచరించే ప్రతి అంశం వెనుక శాస్త్రీయత ఉంటుంది. ఇవి మనమీద రుద్దిన విషయాలు కాదు. అందువల్ల మనం స్వదేశీ ఉద్యమాన్ని మరోసారి ప్రారంభించాలి.  వందేమాతర ఉద్యమంలో వచ్చిన మరో నినాదం స్వదేశీ. బాలగంగాధరతిలక్ గణేష్ ఉత్సవాల పేరిట స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యత ఇస్తూ విదేశీ వస్తువులు బహిష్కరించారు. వందేమాతరాన్ని ఆరోజు కాంగ్రెస్ ఆపేయడం కారణంగా విభజన జరిగింది. కావున మరోసారి విభజన జరగకుండా ఉండేందుకు మనందరం ప్రయత్నించాలి. ఎన్ని మతాలున్నా మనమంతా ఒకతల్లిబిడ్డలం అనే రీతిలో జీవించాలి. వందేమాతరం పూర్తి గీతం మన ఇంట్లో ఉంచుకుని ఆలపించాలి.





## కాకినాడ పునీతమైంది : సానా సతీష్‌బాబు, రాజ్యసభ సభ్యులు

కాకినాడలో వందేమాతర గీతం పాడినట్లు తెలుసుకుని చాలా గర్వించాను. ఇక్కడ ఈ గీతానికి అవమానం జరిగినట్లు తెలుసుకుని



బాధపడ్డాను. కాకినాడకు – వందేమాతర గీతానికి ఉన్న అవినాభావ సంబంధంతో కాకినాడ వాసులు పునీతులయ్యారు. నన్ను ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు అధ్యక్షులు మాధవ్‌కు ధన్యవాదాలు.

## దేశభక్తిని ప్రేరేపించింది : నల్లమల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే

నల్లమల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, బకింటంద్ర చటోపాధ్యాయ ఒక అవమాన భారం నుంచి ఈ గీతాన్ని రచించడం, ఆయన కలం నుంచి జాలు వారిన పరిస్థితిని చూస్తే స్వాతంత్ర్య సమరంలో యోధులకు దేశభక్తిని ప్రబోధిస్తూ, హృదయాన్ని తాకుదూ ఆయన రాసారు. కాని దురదృష్టవశాత్తూ ఆయన జీవించి ఉన్నంత కాలం దీనికి పెద్దగా ప్రాచుర్యం రాలేదు. బెంగాల్ విభజన సందర్భంగా పెద్దఎత్తున ఈ గీతం ద్వారా బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారులు దీనిని అందిపుచ్చుకుని, ఆ తర్వాత దేశం అంతా స్వాతంత్ర్య సమర యోధులు దీనిని ఆయుధంగా చేసుకుని పోరాడారు. ఠాగూర్ దీనిని ఆలపించడం, ఆ సమయంలోనే బకించం ద్ర చెప్పిన మాటలు గుర్తించుకోవాలి. ఈ గీతం ఏనాటికైనా ప్రజల హృదయాలను తాకుందని బకించంద్ర చెప్పారు. ఆయన మరణించిన 9 ఏళ్ల తర్వాత ఈ గీతం ప్రజాబాహుళ్యంలోకి వచ్చి స్వాతంత్ర్యఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించింది. పలు భాషల్లోకి తర్జుమా చేశారు. ఇలా జరిగాక పలు సందర్భాల్లో వందే




మాతర గీతం ద్వారా రాజమహేంద్రవరంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు నేతృత్వంలో వందేమాతరం కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రి తర్వాత కాకినాడలో ఎఐసిసి సమావేశంలో ఈ గీతాన్ని జాతీయ గీతంగా తీసుకువెళ్తున్న నేపథ్యంలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడం, ఆంగ్లేయులు, హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టడానికి సృష్టించిన తగాదాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడంతో ఈ రోజు మనం ఖండిత వందేమాతరానికి పరిమితం చేశారు. దీనిని సుభాస్‌చంద్రబోస్, మహాత్మాగాంధీ వంటి వారు దీనిని వ్యతిరేకించినా, మహాత్మగాంధీ కూడా ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని పరిమాణాల నేపథ్యంలో స్వాతంత్ర్యం తర్వాత వందేమాతరాన్ని తొలిజాతీయగీతంగా పాడారు. కాని దానికి ప్రాధాన్యత మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదు.



## దేశభక్తి ప్రేరేపిత కార్యక్రమాలు : సోము వీర్రాజు, ఎమ్మెల్సీ

సోము వీర్రాజు మాట్లాడుతూ భాజపా దేశంలో వినూత్నమైన అనేక దేశభక్తి ప్రేరేపిత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాజకీయాలకు అతీతంగా ఆలోచించేలా ప్రజల్లో కొత్త ఒరవడిని, కొత్త ఆలోచనలను నేర్పే ప్రయత్నం చేస్తోంది. ఈ మధ్య అహల్యాబాయి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రతిఏడాది నిర్వహిస్తాం. కొంతమంది పూర్తిగీతాన్ని ఆలపించమన్నారు. ఇందులో మతం ఉందన్నారు. దేశంలో మతం లేదు. కాని గీతంలో మతం ఉందని, దానిని కత్తిరించి కొంత భాగానే ఆలపించేలా చేశారు. దాంతో మతపరమైన విభజనకు నాటి కాకినాడ మహాసభ నాంది పలికింది. ఇక రాబోయే రోజుల్లో ఎట్టిపరిస్థితుల్లో విభజన రాకూడదు.

కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీమతి లక్ష్మీప్రసన్న, నాగోతు రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వర రావు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# వందేమాతరం... దేశ సమైక్యతకు వజ్రాయుధం



భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అడుగడుగునా దేశభక్తి జ్వాలను రగిలించి, పరాయి పాలనపై ఉక్కు పిడికిలి బిగించేలా చేసిన అద్భుత అస్త్రం 'వందేమాతరం'. ఈ మహా గీతం ఆవిర్భవించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కేవలం ఒక వేడుకలా కాకుండా, కార్యకర్తలలో, ప్రజలలోనూ నూతనోత్సాహాన్ని, జాతీయ భావాన్ని పునరుజ్జీవింపజేసే వేదికగా నిలిచింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి.వి.ఎన్. మాధవ్, కేంద్ర మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే శ్రీ సుజనా చౌదరి హాజరయ్యారు. వీరితో పాటు పార్టీ రాష్ట్ర పదాధికారులు, ఉపాధ్యక్షు లు, రాష్ట్ర కార్యాలయ ఇన్‌ఛార్జి శ్రీనివాసరెడ్డి, కార్యాలయ కార్యదర్శి బి.ఎల్.ఎన్. పవన్ తదిత ర ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేశభక్తితో మార్మోగిన సభా ప్రాంగణం

సభ ప్రారంభంలో వందేమాతర పూర్తి గీతాన్ని అతిథులు, కార్యకర్తలు సముచిత గౌరవంతో, ఉద్వేగభరితంగా ఆలపించారు. సాధారణంగా వాడుకలో ఉన్న సంక్షిప్త గీతం కాకుండా, బకించంద్ర చటర్జీ రాసిన పూర్తి గీతాన్ని ఆలపించడం ద్వారా అక్కడి వాతావరణం దేశభక్తితో నిండిపోయింది. ఈ సందర్భంగా స్వదేశీ, స్వాభిమానం, స్వావలంబన అనే మూడు ప్రధాన అంశాలపై సభికులు, కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులచే సామూహికంగా ప్రతిజ్ఞ చేయించారు. దేశం కోసం పాటుపడతామని, ఆత్మనిర్భర్ భారత్ దిశగా అడుగులు వేస్తామని అందరూ ముక్తకంఠంతో నినదించారు.

## చరిత్రను గుర్తుచేసిన మాధవ్

అనంతరం సభను ఉద్దేశించి భాజపా రాష్ట్ర అధ్య క్షులు శ్రీ పి.వి.ఎన్. మాధవ్ ఉద్వేగంగా ప్రసంగించారు. వందేమాతర గీతం యొక్క చారిత్రక ప్రాధాన్యతను, వర్తమాన అవసరాన్ని సవివరంగా వివరించారు. "లక్షలాది మంది వీరుల బలిదానాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. వారి త్యాగాల లక్ష్యం నెరవేరాలన్నా, దేశం సమైక్యంగా, అఖండంగా ఉండాలన్నా 'వందేమాతరం' గీతాలాపనను మనం నిత్యం కొనసాగించాలి. ఇది కేవలం ఒక పాట కాదు, భారతీయ ఆత్మకు ప్రతీక," అని మాధవ్ పేర్కొన్నారు. చరిత్రను గుర్తుచేస్తూ.. నాడు బ్రిటిష్ పాలకులు తమ కుట్రలతో దేశాన్ని ముక్కలు చేయాలని, ప్రజల మధ్య వైషమ్యాలు పెంచాలని ప్రయత్నించినప్పుడు, బకించంద్ర చటర్జీ రాసిన 'వందేమాతరం' ఒక పిడుగులా వారిపై పడిందని ఆయన అన్నారు. అనుకోకుండా రాయబడినప్పటికీ, ఆ నినాదం ఒక గొప్ప అస్త్రంగా మారి కోట్లాది మంది భారతీయులను ఏకం చేసిందన్నారు. స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, పోరాట జ్వాలను దిశానిర్దేశం చేసిన ఘనత ఈ గీతానిదేనని కొనియాడారు. అంతటి ఘన చరిత్ర కలిగిన ఈ గీతం నేటికీ మనకు ప్రేరణగా నిలుస్తోందని తెలిపారు.

## బుజ్జగింపు రాజకీయాలపై ధ్వజం

స్వాతంత్ర్యానంతరం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 1947లో దేశ విభజన జరిగిన తీరును, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అనుసరించిన బుజ్జగింపు రాజకీయాలను ఆయన తప్పుబట్టారు. "దేశాన్ని మత ప్రాతిపదిక

న విభజించిన గాయాలు మానకముందే, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొందరు నాయకులు మెజారిటీ ప్రజల మనోభావాలను దెబ్బతీశారు. ఈ వైఖరిని వ్యతిరేకిస్తూనే నాడు 'జనసంఘ్' ఆవిర్భవించింది. ప్రజల్లో చైతన్యం తెచ్చి దేశాన్ని సమైక్యంగా ఉంచేందుకు జనసంఘ్, ఆ తర్వాతి కాలంలో బీజేపీ నిరంతరం పోరాడుతూనే ఉన్నాయి," అని ఆయన స్పష్టం చేశారు.

## కుహనా లౌకికవాదంపై నిప్పులు

ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులపై మాట్లాడుతూ, భారతదేశం 'సర్వమత సౌభ్రాతృత్వం' (అన్ని మతాల సహజీవనం) కోరుకుంటుంటే, కొందరు మాత్రం మత విస్తరణే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. తమ మతాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దే ప్రయత్నాలు, మత మార్పిడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఇలాంటి మత ఛాందసవాదులకు కుహనా లౌకికవాదులైన కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వంటి పార్టీలు అండగా నిలవడం దురదృష్టకరం. మతపరంగా దేశాన్ని మరోసారి చీల్చాలనుకునే కుట్రలకు ఈ పార్టీలు పరోక్షంగా సహకరిస్తున్నాయి," అని మాధవ్ తీవ్రంగా దుయ్యబట్టారు. తమ ఇష్టానుసారం అందరూ నడవాలనే కొందరి ఏకపక్ష నిర్ణయాలు ఈ గడ్డపై చెల్లవని, మతాలను బలవంతంగా ఆచరింపజేసే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు.




## జాతీయవాద శక్తుల ఐక్యతే శరణ్యం

దేశంలో విచ్ఛిన్నకర శక్తులు పేట్రేగిపోతున్న తరుణంలో జాతీయవాద శక్తులన్నీ ఏకం కావా ల్సిన అవసరం ఎంతైనా ఉందని మాధవ్ పిలుపునిచ్చారు. బకించంద్రచటర్జీ గీతంలోని సారాంశం దేశాన్ని ఒక మాతృమూర్తిగా, దేవతగా ఆరాధించడమేనని, ఆ భావన ప్రతి భారతీయుడిలోనూ రగిలించాలన్నారు. "నాడు స్వాతంత్ర్య పోరాట సమయంలో మనలో ఎలాంటి సమరోత్సాహం, సమైక్యతా భావం ఉందో, నేడు అటువంటి చైతన్యం తిరిగి రావాలి. విచ్ఛిన్నకర శక్తులను అడ్డుకోవడానికి మనమందరం కంకణబద్ధులం కావాలి," అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

బకించంద్ర చటర్జీ ఈ గీతాన్ని అందించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఆయనను స్మరించుకుంటూ, ఆ గీతం నేర్పిన స్ఫూర్తితో ముందుకు సాగుదామని మాధవ్ కోరారు. వందేమాతర గీతాన్ని పూర్తిగా చదివి, అర్థం చేసుకుని, దానిని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. "వందేమాతరం మరోసారి ఆలపిస్తూ, నవ భారత నిర్మాణానికి పునరంకితమవుదాం," అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.



# ఆర్థిక, విజ్ఞాన, సాంకేతిక కేంద్రంగా అమరావతి




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో, ముఖ్యంగా నూతన రాజధాని అమరావతి నిర్మాణ ప్రస్థానంలో ఒక కీలకమైన ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని నగరానికి ఆర్థిక పరిపుష్టిని, అంతర్జాతీయ స్థాయి గుర్తింపును తీసుకొచ్చే దిశగా కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఒకేరోజున 15 ప్రముఖ ఆర్థిక సంస్థల (బ్యాంకులు బీమా సంస్థలు) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒకే వేదికపై ఇన్ని సంస్థలు తమ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టడం అమరావతి భవిష్యత్తుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ఈ సందర్భంగా మంత్రి చేసిన ప్రసంగం కేవలం బ్యాంకింగ్ రంగానికే పరిమితం కాకుండా, వ్యవసాయం, సాంకేతికత, సైన్స్, సామాజిక సాధికారత వంటి అనేక అంశాలను స్పృశించింది.

## ఆర్థిక జిల్లా ఆవశ్యకత

ఏదైనా ఒక ప్రపంచ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మించేటప్పుడు, దాని ఆర్థిక మూలాలు బలంగా ఉండటం అత్యవసరం. ఈ విషయాన్ని నొక్కి చెబుతూ, అమరావతికి ఒక ప్రత్యేకమైన 'ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్' ఉండాల్సిన అవసరాన్ని శ్రీమతి నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను విజయవంతంగా నిర్మించిన ఘనతను ఆమె ప్రస్తావించారు. నాడు వేసిన ఆ పునాదులే నేడు హైదరాబాద్‌ను ఆర్థికంగా బలంగా నిలబెట్టాయని, ఇప్పుడు అదే అనుభవంతో, దార్శనికతతో అమరావతిని కూడా తీర్చిదిద్దే అవకాశం చంద్రబాబుకు దక్కడం గర్వకారణమని ఆమె అభిప్రాయపడ్డారు. క్లిష్టమైన ఈ బాధ్యతను ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## రైతులే అమరావతికి ఆయువుపట్టు

అమరావతి అనగానే గుర్తుకు వచ్చేది ఇక్కడి రైతుల త్యాగం. రాజధాని నిర్మాణం కోసం తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులను బ్యాంకింగ్ వ్యవస్థ విస్మరించకూడదని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకులు కేవలం రుణాల మంజూరుకే పరిమితం కాకుండా, రైతుల సంక్షేమానికి అండగా నిలవాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమలోని తొమ్మిది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా మార్చాలని సంకల్పించింది. పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించడం ద్వారా కేవలం బియ్యంపైనే కాకుండా, పౌష్టికాహార భద్రతపై దృష్టి సారించవచ్చు. ఈ క్రమంలో పంటల సాగు నుండి, ప్యాకేజింగ్, రవాణా, మౌలిక సదుపాయాల కల్పన వరకు బ్యాంకులు తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

## మహిళా సాధికారత - 'బీమా సఖి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, మహిళా సాధికారతకు బీమా రంగాన్ని ఎలా వినియోగించుకోవచ్చో హరియాణాలో అమలైన 'బీమా సఖి' కార్యక్రమాన్ని ఉదాహరణగా చూపారు. మహిళలను బీమా ఏజెంట్లుగా నియమించడం ద్వారా బీమా కవరేజీని పెంచడమే కాకుండా, ఆర్థిక స్వలంబన చేకూర్చవచ్చని తెలిపారు. అమరావతి కేంద్రంగా ఇలాంటి వినూత్న కార్యక్ర మాలను అమలుచేయాలని బ్యాంకర్లకు సూచించారు.

## టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్

భవిష్యత్తు అంతా కృత్రిమ మేధ పైనే ఆధారపడి ఉంది. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ యువతను సన్నద్ధం చేయడానికి 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండస్ట్రీ

కౌన్సిల్ ద్వారా కేంద్రం నిధులు సమకూరుస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా రెండుజిల్లాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇది రాష్ట్రంలోని యువతకు నూతన సాంకేతిక నైపుణ్యాలను అందించడంలో కీలక పాత్ర పోషించనుంది.



## సైన్స్, ఆస్ట్రోఫిజిక్స్, పరిశోధన

ఆంధ్రప్రదేశ్ ఒకప్పుడు సైన్స్‌కు, శాస్త్రవేత్తలకు పుట్టినిల్లు. అయితే కాలక్రమేణా కోర్ సైన్సెస్ అయిన ఫిజిక్స్, కెమిస్ట్రీలపై ఆసక్తి తగ్గి, ఐటీ వైపు మొగ్గు పెరిగింది. ఈ అసమతుల్యతను సరిదిద్దాల్సిన అవసరాన్ని మంత్రి నొక్కి చెప్పారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామం. లద్దాఖ్‌లోని హ్యాన్లేలో ఉన్న అబ్జర్వేటరీ తరహాలో, అమరావతిలో కూడా అత్యాధునిక ప్లానిటోరియం, అబ్జర్వేటరీని ఏర్పాటు చేయనున్నారు. దేశంలోని ఇతర ప్లానిటోరియంల మాదిరిగా రికార్డ్ చేసిన దృశ్యాలను చూపించడం కాకుండా, రియల్ టైమ్‌లో టెక్నాలజీని ఉపయోగించి నక్షత్రాలను, పాలపుంతను వీక్షించే అవకాశం ఇక్కడ కల్పించనున్నారు. ఇది విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తుంది.

## భవిష్యత్ లక్ష్యాలు

ఆంధ్రప్రదేశ్ గడ్డకు ఘనమైన చరిత్ర ఉంది. రసాయన శాస్త్రంలో ఆచార్య నాగార్జునుడి నైపుణ్యం టిబెట్ వరకు వ్యాపించిందని, ఆ స్ఫూర్తిని మనం కొనసాగించాలని మంత్రి గుర్తుచేశారు. అలాగే, ఆధునిక సాంకేతికతకు అవసరమైన అరుదైన ఖనిజాల కోసం చైనా వంటి దేశాలపై ఆధారపడకుండా, స్వదేశీ పరిజ్ఞానంతో ఇక్కడే వెలికితీసేలా శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

అమరావతి కేవలం ఒక పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా... ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, నాబార్డ్, ఎల్ఐసీ వంటి 15 ప్రధాన ఆర్థిక సంస్థల రాకతో ఆర్థిక శక్తిగా, ఏఐ శిక్షణా కేంద్రాలతో సాంకేతిక హబ్‌గా, ఆస్ట్రోఫిజిక్స్ అబ్జర్వేటరీతో విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్న ఈ అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు చిత్రపటాన్ని మార్చివేస్తుందనడంలో సందేహం లేదు. రాజధాని నిర్మాణంలో రైతుల త్యాగం, పాలకుల దార్శనికత, ఆర్థిక సంస్థల సహకారం కలగలిసి అమరావతిని ఒక విశ్వనగరంగా తీర్చిదిద్దుతాయని ఈ కార్యక్రమం స్పష్టమైన సంకేతాలను అందించింది.



# మట్టి, మంచినీరే రైతుకు ప్రాణాధారం - శివరాజ్ సింగ్ చౌహాన్



### దేశానికే దిక్సూచి వెంగళాయపాలెం

గుంటూరు జిల్లాలోని 150 ఏళ్ల చరిత్ర కలిగిన వెంగళాయపాలెం చెరువును ఆధునిక హంగులతో, పర్యావరణహితంగా అభివృద్ధి చేసిన తీరును మంత్రి స్వయంగా పరిశీలించి మంత్రముగ్ధులయ్యారు. ఈ చెరువు అభివృద్ధి దేశానికే ఆదర్శమని, ఇదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అనేక చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుడదామని ప్రకటించారు. చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యామ్‌ల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పెంచి, రైతులకు మేలు చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. సభలో కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ ప్రజలతో ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పచుకు

## గుంటూరులో ఘనంగా ముగిసిన జాతీయ వాటర్‌షెడ్ మహోత్సవ్

"మనకు మంచినీరే జీవితం..మట్టి లేనిదే రైతులకు ఆధారం లేదు. ఈ రెండింటినీ కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరం నడుం బిగిద్దాం. మట్టికి జీవం పోసి, మంచినీటిని పరిరక్షించు కోవాలనే సమున్నత ఆశయంతో చేపట్టిన వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని ప్రజాఉద్యమంగా ముందుకు తీసుకెళదాం" అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీశివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. గుంటూరు వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ప్రతిష్ఠాత్మక 'వాటర్‌షెడ్ మహోత్సవ్' ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నల్లపాడు లయోలా పాఠశాల మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలోనూ, గుంటూరులోని ఓ హోటల్లో జరిగిన జాతీయ సదస్సు ముగింపు సమావేశంలోనూ ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ఇప్పేరు, అన్నమయ్య జిల్లా గుండ్లపల్లి, కుప్పం నియోజకవర్గంలోని కడపల్లిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో భూమిపూజలు, ప్రారంభోత్సవాలు చేశారు.

న్నారు. "మధ్యప్రదేశ్‌లో ప్రజలు నన్ను ప్రేమాభిమానాలతో 'మామ' అని పిలుచుకుంటారు. ఇప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా నేను మామనే" అని ఆయన చెప్పడంతో సభలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హిందీలో అనర్గళంగా మాట్లాడడం తనను ఆశ్చర్యపరిచిందని, వచ్చేసారి తాను ఏపీకి వచ్చేసరికి తెలుగు నేర్చుకుని వస్తానని చౌహాన్ చమత్కరించారు.





## అభివృద్ధిలోనూ 'ఆంధ్రా' ఫస్ట్

మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల కలయిక రాష్ట్రానికి ఒక సరైన కాంబినేషన్ అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్ర' దిశగా నడిపిస్తున్నారని ప్రశంసించారు. అక్షర క్రమంలోనే కాకుండా, అభివృద్ధి క్రమంలోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా ఉండాలని ఆకాంక్షించారు. చిన్న, సన్నకారు రైతుల కష్టాలు తనకు తెలుసన్న ఆయన, రైతులు కేవలం వరి సాగుకే పరిమితం కాకుండా ఉద్యాన పంటలు, పూల సాగు, ఆక్వా రంగాల్లోనూ రాణించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

## వరాల జల్లు - నిధుల వెల్లువ

రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెబుతూ, పలు వరాలను ప్రకటించారు. రాష్ట్రంలో ఏ నిరుపేదా కచ్చాఇంట్లో ఉండకూడదనే సంకల్పంతో, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పక్కా ఇళ్ల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. దీనికోసం ప్రత్యేక సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏపీ పల్లెల్లో రోడ్ల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రూ. 358.82 కోట్లను మంజూరు చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వుల ప్రతిని వేదికపైనే కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు అందజేశారు. గతంలోనూ రూ. 5 వేల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు.

## పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలు: పెమ్మసాని

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, పల్లెలు దేశ ప్రగతికి పట్టుగొమ్మలని, భూమి తల్లి అయితే నీరు ప్రాణమని అభివర్ణించారు. రాష్ట్రం కష్టకాలంలో ఉన్నప్పుడు శివరాజ్ సింగ్ చౌహాన్ అండగా నిలిచారని కొనియాడారు. విజయవాడ వరదలు సంభవించినప్పుడు స్వయంగా పర్యటించి రూ. 1000 కోట్ల సాయం అందేలా చూశారని గుర్తు చేశారు. 2019కి ముందు ఉపాధిహామీ పనులు చేసి నష్టపోయిన చిన్న గుత్తేదార్లను ఆదు కునేందుకు రూ. 180 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేసి న్యాయం చేశారని తెలిపారు. యూరియా కొరతను కూడా తక్షణమే పరిష్కరించారన్నారు.

## వాటర్‌షెడ్ విజేతలకు పురస్కారాలు

నీటి సంరక్షణలో అద్భుత ఫలితాలు సాధించిన ప్రాజెక్టులకు 'వాటరేడ్ జనాభాగీదారీ కప్-2025' పేరిట అవార్డులను అందజేశారు. చిత్తూరు జిల్లా చెరుకువారిపల్లి, శ్రీసత్యసాయి జిల్లా మద్రి కొమ్మదిన్నె, గంగాళమ్మ చెరువు, అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి, ప్రకాశం జిల్లా తువ్వపాడు, మారెళ్ల, విజయనగరం జిల్లా మెరకముడియం ప్రాజెక్టులు విజేతలుగా నిలిచాయి. ఈ ప్రాజెక్టుల నిర్వాహకులకు రూ. 20 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు చెక్కులను మంత్రులు అందజేశారు. ఈ రెండు రోజుల సదస్సులో జరిగిన మేధో మథనం ద్వారా వచ్చిన సిఫార్సులతో 'ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన 3.0' రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. ఇక్రిశాట్, ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తలు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు శ్యామ సుందర్ పాలీవాల్, ఉమాశంకర్ పాండేలు తమ అనుభవాలను పంచుకున్నారు. నీటి సంరక్షణ విధానాలను ఇతర రాష్ట్రాలు కూడా అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ ఉన్నతాధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో మంత్రి చౌహాన్













# మహిళా శక్తి బలోపేతానికి చారిత్రక కృషి




## మహిళా మోర్చా సభలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, అధ్యక్షులు మాధవ్ వెల్లడి

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ దార్శనికతతో కూడిన 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకునే దిశగా భారతీయ జనతా పార్టీ శ్రేణులు, ప్రజలు కంకణబద్ధులై పనిచేయాలని కేంద్ర మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ ఉద్ఘాటించారు. పార్టీలో మహిళా శక్తిని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా శ్రీమతి ఎం.నిషిధారాజు నియమితులైన శుభసందర్భంగా నవంబరు 11వ తేదీన తిరుపతిలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో భూపతిరాజు శ్రీనివాసవర్మ, భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

### ఆత్మనిర్భర భారత్‌తో ఉన్నతి

సభనుద్దేశించి కేంద్ర మంత్రి శ్రీ శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, ఉత్పత్తి రంగాన్ని బహుముఖంగా అభివృద్ధి పరిచి, మన దేశ పారిశ్రామిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే 'మేకిన్ ఇండియా' నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని సూచించారు. దేశం యొక్క నిజమైన ఆర్థిక స్వావలంబనను సాధించే లక్ష్యంతో 'ఆత్మనిర్భర భారత్' ఆశయంగా పని చేయగలిగితే, ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా ఉన్న మన దేశాన్ని అత్యంత వేగంగా మూడవ స్థానానికి, ఆపై అగ్రస్థానంలోకి తీసుకెళ్లవచ్చని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ జాతీయ లక్ష్యసాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ఈ సందర్భంగా, కొత్తగా బాధ్యతలు చేపట్టిన నిషిధారాజు నాయకత్వంలో మహిళా మోర్చా మరింత శక్తిమంతమై, క్షేత్రస్థాయిలో పార్టీకి వెన్నెముకగా నిలుస్తుందనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. మహిళా మోర్చా విస్తరణ, బలోపేతం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను, ముఖ్యంగా మహిళా సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

### మహిళా రిజర్వేషన్లు: చారిత్రక నిర్ణయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని స్పష్టం చేశారు. ఇటీవల పార్లమెంటులో ఆమోదించబడిన ఈ నారీ శక్తి వందన్ అధినియం మహిళా సాధికారత దిశగా మోడీ ప్రభుత్వం తీసుకున్న ఒక చారిత్రక నిర్ణయమన్నారు. ముఖ్యంగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పెద్ద సంఖ్యలో గెలిపించుకోవాల్సిన అవసరం కూటమిపై ఉందన్నారు. స్థానిక పాలనలో మహిళలు భాగస్వాములైతేనే ప్రభుత్వ సంక్షేమం మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయికి చేరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా, ఎం. నిషిధారాజును ఘనంగా సత్కరించి, వారి భవిష్యత్తు కార్యకలాపాలకు నాయకులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో మిత్రపక్ష కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించేందుకు అహర్నిశలు శ్రమిస్తోందని ఎంపీ పాకా వెంకట సత్య నారాయణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు తెలిపారు. ఈ కృషిలో మహిళా మోర్చా చురుకైన పాత్ర పోషించాలన్నారు.

# ప్రధాని మోడీ గొప్ప దార్శనికుడు




## లా కళాశాలలో

భాజపా ఆధ్వర్యంలో తిరుపతి అంబేద్కర్ గ్లోబల్ లా కళాశాలలో జరిగిన 'స్వశక్త భారత్ – ఆత్మనిర్భర్ భారత్' సదస్సులో కేంద్ర మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాసవర్మ, భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ, కాలం చెల్లిన, బ్రిటీ ష్ కాలం నాటి పాత చట్టాలను పూర్తిగా మార్చి వేసి, మన దేశ అవసరాలకు, న్యాయ స్ఫూర్తికి అనుగుణంగా భారతీయ న్యాయ చట్టాలకు రూపకల్పన చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీని గొప్ప దార్శనికుడిగా కొనియాడారు. ఇండియన్ పీనల్ కోడ్ , క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ , ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కొత్త భారతీయ న్యాయ సంహితలను తీసుకురావడం అనేది సాధారణ విషయం కాదని, ఇది మన న్యాయ వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పు అని ఆయన స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థకు కాబోయే మూలస్తంభాలుగా ఉన్న న్యాయ విద్యార్థులందరూ ఈ నూతన చట్టాలపై లోతైన అవగాహన పెంచుకోవాలని, వాటిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ న్యాయ సంస్కరణలు న్యాయం అందించే విధానాన్ని మరింత పారదర్శకంగా, వేగంగా మారుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఉత్పత్తులను మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని విద్యార్థులను కోరారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యం విద్యార్థులు, యువత చేతుల్లోనే ఉందని ఆయన నొక్కిచెప్పారు.



## 'మన ఊరు- మన జెండా'

ఉదయం తిరుపతిలో 'మన ఊరు– మన జెండా' కార్యక్రమంలో భాగంగా పళణి థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ మాధవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ముఖ్య కార్యక్రమాలలో బీజేపీ నేతలు విష్ణుకుమార్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, సామంచి శ్రీనివాస్, నాగలక్ష్మి, మాధవి, పార్వతి, యువశ్రీ, విజయలక్ష్మి, ఇతర ముఖ్య నేతలు, శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీహార్‌లో ఎన్డీఏ ప్రభంజనం



బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని లిఖిం చాయి. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీల 'డబుల్ ఇంజన్ సర్కార్' అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి, రాష్ట్రం లో ఎన్డీఏ సునామీని సృష్టించింది. ఈ విజయం కేవలం సీట్ల సంఖ్యలో మాత్రమే కాక, రాజకీయ విశ్లేషకుల అంచనాలు, ఎగ్జిట్ పోల్స్ అంచనాల ను సైతం దాటి అప్రతిహతంగా సాగింది. 243 అసెంబ్లీ స్థానాలున్న బిహార్‌లో నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఏకంగా 202 సీట్లతో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ ఘన విజయం బిహార్ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది.

మరోవైపు, ఆర్జేడీ నేతృత్వంలోని మహా గట్‌బంధన్‌కు ఈ ఎన్నికలు చావుదెబ్బగా పరిణమించాయి. అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేసిన ప్రతిపక్ష కూటమి కేవలం 35 సీట్లకే పరిమితమై, ప్రతిపక్ష హోదాను కూడా తృటిలో, కన్నులొట్టబోయినట్లుగా సాధిం చగలిగింది. ఈ దారుణ పరాజయం విపక్ష కూటమి నాయకత్వ లోపాన్ని, అంతర్గత సమన్వ య వైఫల్యాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది. ముఖ్యం గా, 'ప్రశాంత్ కిశోర్ పార్టీ' జన్ సురాజ్ మొత్తం 243 స్థానాల్లో పోటీ చేసినా, ఒక్క ఖాతా కూడా తెరవలేకపోవడం వారి ఎన్నికల వ్యూహంలోని లోపాలను తెలియజేసింది. ఎంఐఎం 32 స్థానా ల్లో పోటీ చేసి 5 చోట్ల గెలిచింది.

## సమన్వయం' ఆయుధం

ఎన్డీఏ కూటమి ఈ అద్భుత ఫలితాలను సాధించ డానికి అనేక కీలక అంశాలు దోహదపడ్డాయి. సమన్వయం, పటిష్టమైన ఎన్నికల వ్యూహం, క్షేత్రస్థాయిలో ప్రజలను ఆకట్టుకున్న హామీలు ఈ విజయానికి పునాదులయ్యాయి.

## అభివృద్ధి-సంక్షేమ హామీలు

డబుల్ ఇంజన్ సర్కార్ గత ఐదేళ్లలో చేసిన అభి వృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెంచింది. ముఖ్యంగా, మహిళలకు నగదు బదిలీ వంటి సంక్షేమ పథకాలు, 125 యూనిట్ల ఉచిత విద్యు త్తు, సామాజిక పింఛన్ల పెంపు వంటివి మహిళా ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యమం త్రి రోజ్‌గార్ యోజన కింద దాదాపు కోటి మంది మహిళల ఖాతాల్లో రూ. 10,000 జమ



చేయడం వంటి పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరడం ఎన్నికల్లో కీలకంగా మారింది.

## మహిళా-యువత (ఎం-వై) ఫార్ములా

ఆర్జేడీ ముస్లిం-యాదవ్ (ఎం-వై) సమీకరణంపై దృష్టి సారించగా, ఎన్డీఏ మహిళా-యువత వర్గాలను లక్ష్యంగా చేసుకుంది. ఫలితాలు చూస్తే, పురుషుల కంటే 10% అధికంగా మహిళలు ఎన్డీఏకే మద్దతు పలికినట్లు స్పష్టమవుతోంది. ఇది ఎన్డీఏ వ్యూహాత్మక విజయానికి నిదర్శనం.

## జంగిల్ రాజ్' భయం

ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో ఆర్జేడీ అధికారంలోకి వస్తే మళ్లీ రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' (అరాచక పాలన) వస్తుందనే అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. గతంలో ఆర్జేడీ పాలనలో శాంతిభద్రతలపైఉన్న అపఖ్యాతిని ప్రజలు గుర్తుంచుకోవడం ఎన్డీఏకు కలిసివచ్చింది.

## మద్య నిషేధం

నీతీశ్ ప్రభుత్వం చేపట్టిన మద్య నిషేధం మహిళల నుంచి విశేష మద్దతును కూడగట్టింది.

## దళిత వర్గాల విశ్వాసం

రాష్ట్ర జనాభాలో దాదాపు 20% వరకు ఉన్న దళితులు ఆర్జేడీ, కాంగ్రెస్ హామీలను నమ్ముకుండా ఎన్డీఏవైపే మొగ్గు చూపారు. ఈ వర్గం ఓట్లు ఎన్డీఏ విజయానికి ఆయువుపట్టుగా నిలిచాయి.

## విపక్ష కూటమి వైఫల్యం

మహా గట్‌బంధన్ పరాజయానికి ప్రధాన కారణం అంతర్గత కలహాలు, సమన్వయలోపం. సీట్ల సర్దుబాటులో నెలకొన్న అయోమయం, కీలక నేతల మధ్య సఖ్యత లేకపోవడం వల్ల విపక్ష కూటమి పూర్తిగా చతికిలపడిరది. ఆర్జేడీ నమ్ముకున్న ముస్లిం-యాదవ్ (ఎం-వై) సమీకరణం ముస్లిం ప్రాబల్యమున్న సీమాంచల్ వంటి ప్రాంతాల్లో కూడా పనిచేయకపోవడం ఆ పార్టీ వైఫల్యాన్ని తెలియజేసింది.

ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారం చేసుకున్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తన పార్టీని గెలిపించడం మాట అటుంచి, తాను పోటీ చేసిన రాఘోపూర్ నియోజకవర్గంలోనే కఠిన



పరీక్షను ఎదుర్కొన్నారు. ఆయన కేవలం 14,532 ఓట్ల సాధారణ మెజారిటీతో మాత్రమే బీజేపీ అభ్యర్థి సతీష్ కుమార్ యాదవ్‌పై గెలుపొందగలిగారు. 141 సీట్లలో పోటీచేసిన ఆర్జేడీ కేవలం 25 చోట్ల మాత్రమే గెలిచి, పార్టీ చరిత్రలోనే అత్యంత పేలవ ప్రదర్శన చేసింది. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మరీ ఘోరం. 61 చోట్ల పోటీ చేసి కేవలం 6 సీట్లకే పరిమితమైంది. ఇంటికో ఉద్యోగం వంటి అవాస్తవ హామీలను ప్రజలు, స్వయంగా ఆ పార్టీ కార్యకర్తలే నమ్మలేకపోయారు.

## ఎన్డీఏకు కొత్త ఉత్సాహం

బిహార్‌లో ఎన్డీఏ సాధించిన ఈ ఘన విజయం దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాలకు కొత్త ఉత్సాహాన్నిచ్చినట్లయింది. హరియాణా, మహారాష్ట్ర, దిల్లీలలో ప్రభంజనం తరువాత, బిహార్‌లో కూడా తిరుగులేని విజయం సాధించడం భాజపా నాయకత్వం, వ్యూహంపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనం. యువ గాయని మైథిలి ఠాకూర్ కేవలం 25 ఏళ్ల వయస్సులోనే అలీనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలిచి, రాష్ట్రంలో అత్యంత చిన్న వయసు ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించడం ఈ ఎన్నికల్లో మరో విశేషం.

మొత్తంమీద, బిహార్ ఎన్నికల ఫలితాలు సమన్వయం, అభివృద్ధి, సంక్షేమం, బలమైన నాయకత్వం ఉన్న కూటమికే ప్రజలు పట్టం కడతారని మరోసారి రుజువు చేశాయి. డబుల్ ఇంజన్ సర్కార్‌పై ప్రజలు ఉంచిన విశ్వాసం ఈ భారీ విజయానికి కారణమైంది.

### కూటముల్లో పార్టీల ప్రదర్శన

**ఎన్డీఏ కూటమి లో పార్టీల ప్రదర్శన అద్భుతంగా ఉంది.**

**భారతీయ జనతా పార్టీ : ఈ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించింది. 101 సీట్లలో పోటీ చేసి ఏకంగా 89 చోట్ల గెలిచి, 88% స్ట్రైక్ రేట్ సాధించింది.**

**101 సీట్లలో పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది.**

**లోక్ జనశక్తి (రాంవిలాస్): 28 చోట్ల పోటీ చేసి 19 చోట్ల గెలిచింది.**

**ఇతర మిత్ర పక్షాలు : జీతన్ రాం మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ అవామ్ మోర్చా 6 చోట్ల పోటీ చేసి 5 చోట్ల గెలిచింది, రాష్ట్రీయ లోక్ మోర్చా 6 చోట్ల పోటీ చేసి 4 చోట్ల విజయం సాధించింది.**

**మహా గట్‌బంధన్‌లో, లెఫ్ట్ పార్టీలు 20 చోట్ల పోటీ చేసి 3 చోట్ల విజయం సాధించగా, వికాశ్శీల్ ఇన్సాన్ పార్టీ ఒక్కచోట కూడా గెలవలేకపోయింది.**

# సుపరిపాలన, అభివృద్ధి విజయం - ప్రధాని మోడీ



బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ సాధించిన చారిత్రక విజయాన్ని వేడుక చేసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ ప్రధాన కార్యాలయానికి విచ్చేసి, కార్యకర్తలను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. బిహార్ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, పవిత్రమైన ఛాత్ పూజచేసి గౌరవంగా తన ప్రసంగాన్ని ప్రారంభించారు. బిహార్ ప్రజలు ఎన్డీఏకు చారిత్రక తీర్పునిచ్చి, అన్ని రికార్డులను బద్దలు కొట్టారని ఆయన కొనియాడారు.

## సుపరిపాలన, అభివృద్ధి విజయం

ఈ విజయం మంచి పాలన, అభివృద్ధి, సామాజిక న్యాయం సాధించిన విజయమని మోడీ ప్రకటించారు. బిహార్ ప్రజలు "ఫిర్ ఏక్ బార్ ఎన్డీఏ సర్కార్" (మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం) అని ప్రకటించడం ద్వారా, వారు జంగిల్ రాజ్ (అరాజకత్వం)కు ముగింపు పలికారని, 'కట్టా సర్కార్' (నేరంతో ముడిపడిన ప్రభుత్వం) మళ్లీ రాదన్నారు. ఆర్జేడీ కంటే కాంగ్రెస్ ఎక్కువగా బాధపడుతోందని ఎద్దేవా చేస్తూ, బిహార్ ప్రజలు వికసిత బిహార్ కోసమే ఓటు వేశారని స్పష్టం చేశారు.

## 'మహిళా-యువత' కొత్త ఫార్ములా

కొన్ని పార్టీలు అనుసరించిన పాత బుజ్జగింపు 'ముస్లిం–యాదవ్' ఫార్ములాను ఈ విజయం ధ్వంసం చేసిందని, బదులుగా మహిళలు, యువత అనే కొత్త, సానుకూల ఫార్ములాను ఇచ్చిందని మోడీ ప్రకటించారు. ఈ విజయం మహిళలు, యువత శక్తిగా, ముఖ్యంగా జంగిల్ రాజ్‌తో బాధపడిన మహిళలు, కూతుళ్ల విజయం అని వర్ణించారు. యువత కలలు, ఆకాంక్షలు ఈ విజయానికి మార్గం వేశాయని చెప్పారు. బిహార్ ప్రజలు బుజ్జగింపు రాజకీయాలను తిరస్కరించారని మోడీ పునరుద్ఘాటించారు.

## కార్యకర్తల కృషికి, కూటమికి కృతజ్ఞతలు

ఎన్డీఏ తమ కష్టానికి ప్రతిఫలంగా ప్రజల హృదయాలను చోరీ చేసిందని, ఇదే నిజమైన విశ్వాసమని విపక్షాల ఆరోపణలకు మోడీ ఘాటుగా బదులిచ్చారు. ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఎన్డీఏ కార్యకర్తలు నిరంతరం శ్రమించి, అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లి, విపక్షాల అబద్ధాలను ఎదుర్కొన్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, మిత్రపక్షాలైన చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మంజి, ఉపేంద్ర కుశ్వాహాల గొప్ప నాయకత్వాన్ని అభినందించారు.

## అభివృద్ధి చెందిన బిహార్ హామీ

ఈ విజయం భవిష్యత్తులో కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్లో బీజేపీ విజయానికి కొత్త శక్తినిస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. బిహార్ పెట్టుబడులకు ఇది ఉత్తమ సమయమని చెబుతూ, "మీ విశ్వాసం నా హామీ. యువత కలలు నా ప్రేరణ" అన్నారు. అభివృద్ధి చెందిన, సమృద్ధ బిహార్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. బిహార్ ప్రజలు సామాజిక న్యాయానికి, సమాన అవకాశాలకు ఓటు వేశారని, 'జంగిల్ రాజ్' మళ్లీ రాదు అని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.



## బీహార్‌లో ఎన్‌డియే ప్రభుత్వం

బిహార్‌లో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 202 స్థానాలను కైవసం చేసుకుని అద్భుత విజయం సాధించింది. తమకన్నా తక్కువ స్థానాలు సాధించినా జేడీయూ అధ్యక్షులు నితీష్ కుమార్‌కు ముఖ్యమంత్రిగా భాజపా అవకాశం కల్పించింది. దీంతో నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని పాట్నాలోని చారిత్రక గాంధీ మైదాన్‌లో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. బిహార్ మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవం దేశంలో ఎన్డీఏ బలాన్ని చాటి చెప్పింది. నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు పాల్గొన్నారు. నితీష్ కుమార్ సహా మొత్తం 27 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో విజయం సాధించగా.. భాజపాకు 14 మందికి మంత్రి పదవులు దక్కాయి. ఇక 85 సీట్లు గెలిచిన జేడీయూకి 9 మంత్రి పదవులు దక్కాయి. మరోవైపు.. ఇద్దరు ఎమ్మెల్యేలు డిప్యూటీ సీఎంలుగా ఉంటారని పేర్కొన్నారు. భాజపా నుంచి సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హాలు మరోసారి బిహార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. భాజపా నుంచి దిలీప్ జైస్వాల్ వంటి అనుభవజ్ఞులతో పాటు.. కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్, షూటర్ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన 34 ఏళ్ల శ్రేయసి సింగ్ కూడా మంత్రిగా ప్రమాణం చేశారు. బిహార్‌లో మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం వేళ.. ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బిహార్ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభా కాంక్షలు అని పేర్కొన్నారు. ఇది అద్భుతమైన టీమ్ అని.. అంకితభావం కలిగిన నాయకులు బిహార్ రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకువెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజల విశ్వాసానికి నిదర్శనం: శ్రీ అమిత్ షా, కేంద్ర హెూం మంత్రి



బిహార్ ప్రజలు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై, ముఖ్య మంత్రి నితీశ్ కుమార్ పాలనపై తమకు ఉన్న పూర్తి విశ్వాసాన్ని మరోసారి నిరూపించారు. ఈ విజయం సుపరిపాలన, అభివృద్ధికి లభించిన ఆశీర్వాదం. ఎన్డీయే కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య ఉన్న పటిష్టమైన ఐక్యత ఈ విజయానికి ప్రధాన కారణం. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి, ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేయడమే ఈ విజయాన్ని సాధించింది. రాబోయే ఐదేళ్లలో బిహార్‌ను అన్ని రంగాలలోనూ అభివృద్ధి పథంలో నడిపించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది.

## కార్యకర్తల కృషికి అంకితం: శ్రీ జె.పి. నడ్డా జాతీయ అధ్యక్షులు



ఈ చారిత్రాత్మక విజయం బీజేపీ, కూటమిలోని ప్రతి కార్యకర్త అలుపెరుగని కృషికి అంకితం. పోలింగ్ బూత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు అద్భుతంగా పని చేశారు. బిహార్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి మద్దతు పలికారు. భూతపూర్వమైన మద్దతు ఇచ్చినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' అనే మంత్రానికి దేశవ్యాప్తంగా లభిస్తున్న ఆమోదానికి నిదర్శనం. రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలకు బిహార్ విజయం ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తుంది.

# మోడీపై బిహార్ ప్రజల నమ్మకానికి నిదర్శనం





బిహార్‌లో ఎన్డీయే సాధించిన భారీ, చారిత్రాత్మక విజయం ప్రజలకు, ప్రధాని నరేంద్ర మోడీ ప్రగతి శీల పాలనపై ఉన్న నమ్మకాన్ని ప్రతిఫలిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. తమ కూటమికి ఈ చారిత్రక విజయాన్ని అందించిన బిహార్ ప్రజలకు వారు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. ఈ విజయాన్ని కేవలం రాజకీయ గెలుపుగా కాకుండా, ప్రధాని నరేంద్ర మోడీ – ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని సుపరిపాలన, అభివృద్ధికి ప్రజలు ప్రేమతో అందించిన అత్యుత్తమ కానుకగా వారు అభివర్ణించారు. బిహార్ ప్రజల ఈ స్పష్టమైన తీర్పు, దేశ ప్రజల నాడిని ప్రతిబింబిస్తోందని వారు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ  నాయకత్వంలోనే భారతదేశ సమగ్రాభివృద్ధి, సుస్థిరమైన, పటిష్టమైన పాలన సాధ్యమని దేశంలోని అత్యధిక జనాభా బలంగా విశ్వసిస్తోందని ఈ ఫలితాలు నిరూపించాయని నేతలు ప్రకటించారు. దేశవ్యాప్తంగా సాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల విజయానికి కృషి చేసిన కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా, బిహార్ ముఖ్యమంత్రి శ్రీ నీతీశ్ కుమార్, అలాగే భాజపా జాతీయ అధ్యక్షుడు శ్రీ జె.పి.నడ్డాకి నాయకత్వ పటిమను వారు ప్రత్యేకంగా అభినందించారు. బిహార్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఎన్డీయే ప్రభుత్వాధినేత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి బిహార్ ప్రజలు అందించిన సంపూర్ణ మద్దతు, సంపూర్ణ విశ్వాసానికి తిరుగులేని నిదర్శనమని వారు పునరుద్ఘాటించారు. బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ మరింత వేగంతో అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తుందని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.











# మహానేత వాజ్‌పేయి - శ్రీనివాసవర్మ



## మండపేటలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

భారతీయ జనతా పార్టీని రెండు స్థానాల నుంచి అధికారం సాధించే దిశగా నడిపించిన మహా నేత, స్వర్గీయ మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీభూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. వాజ్‌పేయి శత జయంతి వేడుకల సందర్భంగా మండపేటలో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మండపేట బైపాస్ రోడ్డు వంతెన ఎదురుగా మాజీ ప్రధానమంత్రి భారతరత్న దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని భాజపా రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన జయంతి వేడుకల సభలో కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ... అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ తో కలిసి పాల్గొన్నారు. వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు మండపేటలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ స్ఫూర్తిగా తీసుకొని భాజపా ఒక సంకల్పానికి వచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అటల్ జి సందేశ్ మోదీ సిద్ధియాత్ర పేరుతో ఒక భారీ ర్యాలీని నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. ఈ ర్యాలీ నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా వాజ్‌పేయి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ఆలోచనకు మండపేటలో విగ్రహం ఏర్పాటు చేయడమే స్ఫూర్తిగా తీసుకున్న్లు ఆయన తెలిపారు. వాజ్‌పేయి ఒక మహా నేత అని అభివర్ణించారు. ఆయన విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. నమ్మిన సిద్ధాంతాలు రాజకీయ విలువలను దృష్టిలో పెట్టుకుని, ప్రధాని పదవిని సైతం త్యాగం చేశారని గుర్తు చేశారు. ఆయనతో పాటు హేమాహేమీలంతా ఓడిపోయిన సమయంలో కూడా, ఎంతో ధైర్యంగా పార్టీని నడిపించిన ఘనత వాజ్‌పేయిదన్నారు. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైన పరిస్థితుల్లో కూడా.. ఆత్మస్థైర్యంతో పార్టీని విజయం

వైపు నడిపించిన మహా నేత ఆయన అని మంత్రి అభివర్ణించారు. అలాంటి నేతకు శత జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళు లర్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భారతీయ జనతా పార్టీలోని ప్రతి ఒక్కరూ.. వాజపేయి గారి పనితీరును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



## అటల్ జి స్వర్ణ చతుర్భుజి

భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ.. దేశంలో స్వర్ణ చతుర్భుజి పేరు చెబితే గుర్తుకు వచ్చేది అటల్ జి అని అన్నారు.



దేశంలోని నాలుగు ప్రధాన మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాలను కలిపే సుమారు 5,846 కి.మీ.ల జాతీయ రహదారుల ప్రాజెక్టును ఆయన ప్రారంభించారన్నారు. ఇది దేశంలో వస్తువుల రవాణాను వేగవంతం చేసి, ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేసిందని మాధవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన , విద్య , సామాజిక అభివృద్ధి, సర్వ శిక్షా అభియాన్, టెలికాం విప్లవానికి వాజ్‌పేయి నాంది పలికారన్నారు. 1999లో కొత్త టెలికాం పాలసీని తీసుకొచ్చి మొబైల్ కాలింగ్ ధరలను తగ్గించి, దేశంలో టెలికాం రంగాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. ఇది సామాన్యులకు కూడా ఫోన్ సేవలు అందుబాటులోకి రావడానికి అటల్ హయాంలోనే మార్గం సుగమం అయ్యిందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ , ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఒక గొప్ప కవిగా, అనన్య సామాన్యమైన రాజకీయ నాయకుడిగా, ఆదర్శవంతమైన ప్రధానిగా దేశ నిర్మాణానికి వాజ్‌పేయి అందించిన సేవలు చిరస్మరణీయం అని అన్నారు. వారి జీవితం, ఆయన సుపరిపాలన సిద్ధాంతాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు , రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణలతో పాటు.. కూటమి పార్టీల నేతలు, శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజా ప్రాధాన్యాలుగా సాంకేతికత కేంద్రీకృతం కావాలి




## జీ-20 శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగం...

జీ20 శిఖరాగ్ర సదస్సు మూడో సమావేశంలో "అందరికీ సమానమైన, న్యాయమైన భవిష్యత్తు – క్లిష్టమైన ఖనిజాలు, మంచి పని, కృత్రిమ మేధస్సు" అనే అంశంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రసంగించారు. క్లిష్టమైన సాంకేతికతలను ప్రోత్సహించే విధానంలో మౌలికమైన మార్పు అవసరమని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. అటువంటి సాంకేతిక అన్వయాలు ఆర్థిక ప్రాధాన్యాలుగా కాకుండా ప్రజా ప్రాధాన్యాలుగా, ఉండాలని, 'స్థానికం' కాకుండా 'అంతర్జాతీయం' గా ఉండాలని, 'ప్రత్యేక నమూనాలకు' బదులుగా 'స్వేచ్ఛా వనరుల' ఆధారంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ దృక్పథం భారత సాంకేతిక వ్యవస్థలో భాగమైందని, ఇది అంతరిక్ష ప్రయోగాలు, కృత్రిమ మేధ, డిజిటల్ చెల్లింపులు మొదలైన ప్రతి రంగంలోనూ భారత్‌ను ప్రపంచ నాయకత్వ స్థాయిలో నిలిపి గణనీయమైన ప్రయోజనాలు అందించిందని ఆయన వివరించారు. ఆయన ప్రసంగం ...: సాంకేతికత వేగంగా పురోగమిస్తున్న కొద్దీ వనరులు, అవకాశాలు కొద్దిమంది వద్దనే మరింతగా కేంద్రీకృతమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రధానమైన సాంకేతికతల విషయంలో పోటీ కూడా తీవ్రమవుతోంది. ఇది మానవ సమాజానికి ఆందోళనకరమే కాకుండా కొత్త ఆవిష్కరణలకు అడ్డంకి కూడా. దీన్ని నిరోధించాలంటే మన ఆలోచనా విధానంలో మౌలికమైన మార్పు అవసరం.

మనం ప్రోత్సహించే సాంకేతికత, 'ఆర్థిక కేంద్రకం' గా కాకుండా ' మానవ కేంద్రకం' గా ఉండాలి. దేశాలకే పరిమితమై పోకుండా ప్రపంచమంతా ఉపయోగించుకునేలా ఉండాలి. పరిమిత ప్రత్యేక వనరుల విధానాల స్థానంలో అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్–సోర్స్ విధానాలను ప్రోత్సహించాలి. భారత్ ఈ భావనతోనే తన సాంకేతిక ప్రాజెక్టులను రూపొందిస్తోంది.

ఈ కారణం చేతనే ప్రపంచంలోనే ఎక్కువ డిజిటల్ చెల్లింపులు భారత్‌లో జరుగుతున్నాయి. అంతరిక్ష సాంకేతికత నుంచి కృత్రిమ మేధస్సు వరకు, ప్రతి రంగంలో పురోగతి, విస్తృత అభివృద్ధి కనిపిస్తోంది.


కృత్రిమ మేధస్సు విషయంలో భారత దేశ విధానం మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా నిర్మితమైంది. అందరికీ సమాన లభ్యత, జనాభా స్థాయిననుసరించి ప్రజలకు శిక్షణ, బాధ్యతాయుత వినియోగం. ఇండియా ఏఐ మిషన్











ద్వారా ప్రతి జిల్లా, ప్రతి భాష వరకు ఏఐ ప్రయోజనాలు చేరేలా శక్తిమంతమైన కంప్యూటింగ్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. దీని వలన మానవ అభివృద్ధి మరింత వేగంగా జరగడానికి తోడ్పాటు లభిస్తుంది.

అదే సమయంలో, ఏఐని విశ్వ శ్రేయస్సు కోసం బాధ్యతగా వినియోగించడం, దుర్వినియోగం జరగకుండా చూడడం ముఖ్యం. ఇందుకు ప్రాథమిక సూత్రాల ఆధారంగా కుదుర్చుకున్న ప్రపంచ స్థాయి ఏఐ ఒప్పందం అవసరం. ఇందులో ప్రభావవంతమైన మానవ పర్యవేక్షణ, నిర్మాణపరమైన భద్రత, పారదర్శకతలతో పాటు డీప్‌ఫేక్‌లు, నేరాలు, ఉగ్రవాదం కోసం ఏఐ వినియోగాన్ని నిషేధించడం వంటి అంశాలు ఉండాలి.

మానవ జీవితం, భద్రత, ప్రజల విశ్వాసంపై ప్రభావం చూపే ఏఐ వ్యవస్థలు తప్పనిసరిగా జవాబుదారీతనంగా, పరీక్షించదగ్గవిగా ఉండాలి. ఏఐ మనుషుల సామర్థ్యాలను పెంచే అవకాశం ఉన్నప్పటికీ, తుది నిర్ణయం మనుషులవద్ద ఉండడం చాలా ముఖ్యమైనది.

2026 ఫిబ్రవరిలో "సర్వజన హితాయ, సర్వజన సుఖాయ" (అందరికీ సంక్షేమం – అందరికీ సంతోషం) అనే థీమ్‌తో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను భారత్ నిర్వహించనుంది. ఈ సదస్సులో అన్ని జీ20 దేశాలు పాల్గొనవలసిందిగా ఆహ్వానం పలుకుతున్నాం. ఈ ఏఐ యుగంలో, మన దృష్టిని "ప్రస్తుత ఉద్యోగాల" నుంచి "భవిష్యత్ సామర్థ్యాల" వైపు మార్చాలి. వేగవంతమైన కొత్త ఆవిష్కరణలకు ప్రతిభ విస్తరణ (టాలెంట్ మొబిలిటీ) చాలా అవసరం. న్యూఢిల్లీలో జరిగిన జీ20 సదస్సులో దీనిపై పురోగతి సాధించాం. రాబోయే కాలంలో జీ20... ప్రతిభ విస్తరణ కోసం ప్రపంచ స్థాయి విధానాలను రూపొందిస్తుందని ఆశిస్తున్నాం. ప్రపంచ సరఫరా వ్యవస్థలు ఎంత బలహీనంగా ఉన్నదీ కోవిడ్ మనకు తెలియజెప్పింది. ఆ కష్టకాలంలో కూడా భారత్ 150 కంటే ఎక్కువ దేశాలకు వ్యాక్సిన్లు, మందులు అందించింది. దేశాలను కేవలం మార్కెట్లుగా చూడకూడదు. వాటి పట్ల ఒక సున్నితమైన, దీర్ఘకాలిక దృష్టికోణాన్ని అలవర్చుకోవాలి. భారతదేశం చెప్పే స్పష్టమైన సందేశం ఏమిటంటే, అభివృద్ధి సుస్థిరంగా ఉండాలి. వాణిజ్యం విశ్వసనీయంగా ఉండాలి. ఆర్థిక వ్యవస్థ న్యాయంగా ఉండాలి. ప్రగతి అందరికీ ఉపయోగపడాలి. అప్పుడే మనం అందరికీ న్యాయంగా, సమానంగా ఉండే భవిష్యత్తును నిర్మించగలం.

# జీ-20 దేశాధినేతలతో మోడీ భేటీ




దక్షిణాఫ్రికాలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ వివిధ దేశాధినేతలతో సమావేశమై చర్చలు జరిపారు.

### ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో భేటీ

జోహన్నెస్‌బర్గ్‌లో ప్రధాని మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో సమావేశమయ్యారు. 2020 లో ఏర్పడిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' బలపడటం పట్ల ఇరువురూ సంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌లో జరిగిన ఉగ్రవాద దాడి పట్ల అల్బనీస్ విచారం వ్యక్తం చేయగా, ఉగ్రవాదంపై పోరుకు ఇరువురూ కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. రక్షణ, వాణిజ్యం, ఇంధనం, కీలక ఖనిజాలు, విద్య వంటి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. ఉన్నత స్థాయి పర్యటనలు సంబంధాలను మెరుగు పరిచాయని, ఈ భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చాలని నేతలు నిర్ణయించారు.

### కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీతో

ప్రధాని మోడీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీతో భేటీ అయి ద్వైపాక్షిక పురోగతిని సమీక్షించారు. ఆస్ట్రేలియా-కెనడా-భారత్ (ఏసీఐటీఐ) సాంకేతిక భాగస్వామ్యాన్ని స్వాగతించారు. 2030 నాటికి వాణిజ్యాన్ని 5,000 కోట్ల డాలర్లకు పెంచే లక్ష్యంతో 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం' (సీఈపీఏ) చర్చలు ప్రారంభించడానికి అంగీకరించారు. యురేనియం సరఫరా, పౌర అణు సహకారం, కృత్రిమ మేధ రంగాల్లో కలిసి పని చేయడంపై చర్చించారు. వచ్చే ఏడాది భారత్‌లో జరగనున్న ఏఐ సదస్సుకు కార్నీ మద్దతు తెలిపారు. ప్రధాని మోడీ ఆయన్ను భారత్ పర్యటనకు ఆహ్వానించారు.

### జపాన్ ప్రధానమంత్రి సనే తకైచీతో

జపాన్ ప్రధాని తకైచీతో జరిగిన సమావేశంలో, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంపై ప్రధాని మోడీ చర్చించారు. రక్షణ, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, వాణిజ్యం వంటి రంగాల్లో గతంలో కుదిరిన ఒప్పందాలను వేగంగా అమలు చేయాలని నిర్ణయించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ స్థిరత్వానికి భారత్-జపాన్ మైత్రి కీలకమని నేతలు అభిప్రాయపడ్డారు. 2026లో భారత్ నిర్వహించనున్న ఏఐ సదస్సుకు జపాన్ మద్దతు ప్రకటించింది. సంప్రదింపులు కొనసాగిస్తూ, త్వరలో మళ్లీ సమావేశం కావాలని ఇరువురూ నిశ్చయించారు.

### దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాతో:

జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు అధ్యక్షుడు రామఫోసాను ప్రధాని మోడీ అభినందించారు. వాణిజ్యం, మైనింగ్, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాల్లో సహకారంపై ఇరువురూ చర్చించారు. పరస్పర పెట్టుబడులను ప్రోత్సహించాలని, 'గ్లోబల్ సౌత్' గళాన్ని వినిపించడానికి కలిసి పనిచేయాలని నిర్ణయించారు. చిరుతలను భారత్‌కు పంపినందుకు రామఫోసాకు కృతజ్ఞతలు తెలిపిన మోడీ, 'బిగ్ క్యాట్ అలయన్స్'లో చేరాలని ఆహ్వానించారు. 2026 బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతల్లో భారత్‌కు దక్షిణాఫ్రికా సంపూర్ణ మద్దతు ప్రకటించింది.



# ఐబిఎస్‌ఏ ఐక్యతతోనే గ్లోబల్ సౌత్‌కు ప్రాముఖ్యత



ప్రపంచం వివిధ కూటములుగా విడిపోతున్న తరుణంలో, ఐబీఎస్‌ఏ ఐక్యత ఒక సానుకూల సందేశాన్ని ఇస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన ఐబీఎస్‌ఏ ( ఇండియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా) నాయకుల సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. ప్రజాస్వామ్య విలువలు, మానవతా దృక్పథంతో గ్లోబల్ సౌత్ గొంతుకను వినిపించడంలో ఐబీఎస్‌ఏ కీలక పాత్ర పోషించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మారుతున్న ప్రపంచ క్రమంలో 'గ్లోబల్ సౌత్' దేశాల ప్రాముఖ్యతను, బాధ్యతను వివరించారు. మూడు ఖండాలకు చెందిన మూడు పెద్ద ప్రజాస్వామ్య దేశాల ఐక్యత ప్రపంచ శాంతికి ఎంతో ఆవశ్యకమని వివరిస్తూ, భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేశారు.

ప్రధాని మోడీ ప్రధానంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఐబీఎస్‌ఏ దేశాలకు శాశ్వత సభ్యత్వం లేకపోవడం 21వ శతాబ్దపు వాస్తవాలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ సంస్థలలో మార్పు అనేది కేవలం ఒక ఎంపిక కాదని, అది వర్ధమాన దేశాల హక్కు అని బలంగా వాదించారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే అంశంగా కూడా పేర్కొన్నారు.

ఉగ్రవాదంపై పోరాటంలో 'ద్వంద్వ ప్రమాణాలకు' తావులేదని మోడీ హెచ్చరించారు. ప్రపంచ శాంతి కోసం మూడు దేశాలు ఏకతాటిపై నడవాలని పిలుపునిచ్చారు. ఈ కూటమిని కేవలం ఆర్థిక వేదికగానే కాకుండా వ్యూహాత్మక కూటమిగా మార్చే దిశగా వేసిన అడుగుగా ఆయన ముందుకు తీసుకువచ్చారు. 2021లో ప్రారంభమైన జాతీయ భద్రతా సలహాదారుల సమావేశాలను సంస్థాగతం చేయాలనే ప్రతిపాదించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతికతను ఆయుధంగా మలచుకోవాలని మోడీ సూచించారు. 'ఐబీఎస్‌ఏ డిజిటల్ ఇన్నోవేషన్ అలయన్స్' ఏర్పాటు ప్రతిపాదన ద్వారా యూపీఐ, కోవిన్ వంటి భారతీయ విజయాలను మిత్రదేశాలతో పంచుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే, కృత్రిమ మేధ వినియోగంలో సురక్షితమైన నిబంధనల కోసం కలిసి పనిచేయాలని కోరారు.

సుస్థిరవృద్ధి కోసం, ఐబీఎస్‌ఏ పరస్పర అభివృద్ధి ప్రయత్నాలకు తోడ్పడటమే కాకుండా, ప్రపంచానికి ఒక ఉదాహరణగా కూడా నిలబడగలదు. చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం, ప్రోత్సాహంలో అయినా, విపత్తుల ప్రతిఘటన, హరిత ఇంధనం విషయంలో అయినా, లేదా సంప్రదాయ వైద్యం, ఆరోగ్య భద్రతలో అయినా, ఈ రంగాలలో మన బలాలను ఏకీకృతం చేయడం ద్వారా, ప్రపంచ సంక్షేమానికి మనం అర్థవంతంగా దోహదపడగలమని సూచించారు. ఈ దృష్టికోణంతోనే ఐబీఎస్‌ఏ నిధిని ఏర్పాటు చేశాం. దాని మద్దతుతో, మనం 40 దేశాలలో దాదాపు 50 ప్రాజెక్టులను అమలు చేశాం. విద్య, ఆరోగ్యం నుంచి మహిళా సాధికారత, సౌరశక్తి వరకు విస్తరించిన ఈ కార్యక్రమాలు స్థానిక సమాజాల అవసరాల ఆధారంగా రూపు దిద్దుకున్నాయి. ఈ సహకార స్ఫూర్తిని మరింత బలోపేతం చేయడానికి మనం వాతావరణ పరిస్థితుల ఆధారిత వ్యవసాయం కోసం కూడా ఐబీఎస్‌ఏ నిధి ఏర్పాటును పరిశీలించవచ్చని పేర్కొన్నారు.

# ఆత్మనిర్భరత: అట్టడుగు వర్గాల సంక్షేమానికి బాట





**శివప్రకాష్,**
**భాజపా సంస్థాగత జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి**

భారతదేశం తన మూలాలను వెతుక్కుంటూ, స్వావలంబన దిశగా వేస్తున్న అడుగులు నేడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. కేవలం ఒక నినాదంగా కాకుండా, ఒక జాతీయ ఉద్యమంగా మారిన 'ఆత్మనిర్భర భారత్' (స్వయం సమృద్ధి) నేడు దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మారుస్తోంది. గత కొన్ని నెలలుగా, ముఖ్యంగా పండుగ సీజన్‌లో భారతీయ మార్కెట్లలో కనిపించిన జోష్, ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన 'వోకల్ ఫర్ లోకల్' (స్థానిక ఉత్పత్తుల ప్రచారం) పిలుపుకు ప్రజలు ఎంతలా ప్రభావితమయ్యారో చెబుతోంది. విదేశీ వస్తువుల మోజు నుండి బయటపడి, స్వదేశీ ఉత్పత్తులను అక్కున చేర్చుకోవడం ద్వారా భారతీయులు ఆర్థిక స్వావలంబనకు గట్టి పునాది వేశారు.

## మోడీ పిలుపు - ప్రజా స్పందన

2014లో నరేంద్ర మోడీ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి దేశీయ పరిశ్రమల బలోపేతమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా', 'మేక్ ఫర్ ది వరల్డ్' వంటి కార్యక్రమాల ద్వారా విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని ప్రధాని నిరంతరం పిలుపునిచ్చారు. అయితే, కోవిడ్-19 సంక్షోభం, ఆ తర్వాత ఏర్పడిన ప్రపంచ ఆర్థిక అస్థిరతల నేపథ్యంలో ఈ పిలుపు ఆవశ్యకతను ప్రజలు బలంగా గుర్తించారు. ఆగస్టు 15న ఎర్రకోట నుండి చేసిన ప్రసంగంలోనూ, 'మన్ కి బాత్' కార్యక్రమాల ద్వారా ప్రధాని మోడీ చేసిన "స్వదేశీ వస్తువులనే కొనండి, స్వదేశీ ఉత్పత్తులతో ఇళ్లను అలంకరించండి" అనే విజ్ఞప్తి ప్రజల మనసుల్లో బాగా నాటుకుంది. కోట్లాది మంది అట్టడుగు వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించే ఒక సమగ్ర ఆర్థిక విధానంగా రూపాంతరం చెందింది. ప్రధాని మోడీ స్వదేశీ నినాదం వెనుకఉన్న అసలైన దార్శనికత ఆర్థిక సాధికారత. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన 'అంత్యోదయ' (సమాజం లో అట్టడుగున ఉన్న వ్యక్తి సంక్షేమం) సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడమే దీని లక్ష్యం. భారతదేశంలో పండుగలు కేవలం మతపరమైన ఆచారాలు మాత్రమే కాదు, అవి దేశ ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఇంధనాలు. మనం పండుగలలో ఉపయోగించే దీపాలు, తోరణాలు, పూలదండలు, బొమ్మలు, పూజా సామాగ్రి, మిఠాయిలు, పాదరక్షలు, ఆభరణాలు వంటివన్నీ దళిత, వెనుకబడిన, గిరిజన వర్గాల నైపుణ్యంతో తయారైనవే. కుమ్మరులు, చర్మకారులు, చేతివృత్తులవారు, అటవీ ఉత్పత్తులపై ఆధారపడిన గిరిజనులు ఈ వస్తువుల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

## ప్రతిఫలించిన 'స్వదేశీ' స్ఫూర్తి

ప్రధాని మోడీ ఇచ్చిన ఈ పిలుపు యొక్క ప్రభావం గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా నెలకొన్న పండుగ వాతావరణంలో స్పష్టంగా కనిపించింది. గణేష్ ఉత్సవాలు, విజయదశమి, దీపావళి వంటి పండుగలు కేవలం మతపరమైన వేడుకలుగానే కాకుండా, సామాజిక సామరస్యాన్ని, ఆర్థిక ఉత్సాహాన్ని పెంచే సాధనాలుగా మారాయి. ఇళ్లను అలంకరించుకోవడం, బహుమతులు పంచుకోవడం వంటి సంప్రదాయ కార్యకలాపాలలో, పౌరులు ఉద్దేశపూర్వకంగానే స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి మొగ్గు చూపారు. 87 శాతం మంది వినియోగదారులు ప్రధాని మోడీ పిలుపుతో ప్రేరణ పొంది, ఉద్దేశపూర్వకంగానే స్వదేశీ వస్తువులను కొనుగోలు చేశామని చెప్పడం ఒక సామాజిక మార్పును సూచిస్తోంది.

మహాత్మా గాంధీ జయంతిని 'ఖాదీ దినోత్సవం'గా జరుపుకునే సందర్భంగా, ప్రధాని మోడీ ఇచ్చిన "కేవలం స్వదేశీ వస్తువులనే కొనండి, స్వదేశీ ఉత్పత్తులతో ఇళ్లను అలంకరించండి, స్వదేశీ వస్తువులతో మీ జీవితాలను సుసంపన్నం చేసుకోండి" అనే పిలుపు ప్రజల కొనుగోలు విధానంలో గుణాత్మక మార్పు తీసుకువచ్చింది. ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం కేవలం దేశభక్తి భావోద్వేగం కాదు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన, అత్యంత నిరుపేద వర్గాలకు ఆర్థిక సాధికారత కల్పించాలనే దార్శనికత.

## అట్టడుగు వర్గాలకు ఆర్థిక సాధికారత

చేతివృత్తుల వర్గం దేశంలోని అత్యంత వెనుకబడిన తరగతులలో సగానికి పైగా ఉంది. గతంలో, చౌకగా దిగుమతి అయిన విదేశీ వస్తువులు స్థానిక ఉత్పత్తుల స్థానాన్ని ఆక్రమించాయి. దీని ఫలితంగా, పేదవారు, చేతివృత్తులవారి జీవనోపాధి దెబ్బతిని, వారి పండుగలు సైతం ఆర్థిక లేమికి చిహ్నంగా మారాయి. స్వదేశీని ప్రోత్సహించడం ద్వారా, ఈ ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేయడం అంటే, డబ్బు నేరుగా

ఆయా వర్గాల ఆర్థిక వ్యవస్థలోకి ప్రవహించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి దోహదపడుతుంది. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 'అంత్యోదయ' (నిరుపేదల సంక్షేమం) తత్వాన్ని ప్రతిధ్వనిస్తూ, మోడీ ఇచ్చిన ఈ పిలుపు, అట్టడుగున ఉన్న వారికి ఆనందాన్ని పంచే ఉత్సవంగా దీపావళిని మార్చింది.

## గణాంకాలలో స్వదేశీ ప్రభావం

స్వదేశీ పిలుపుకు లభించిన అద్భుతమైన స్పందనను మార్కెట్ గణాంకాలు ధృవీకరిస్తున్నాయి. 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్' నిర్వహించిన సర్వే ప్రకారం, 2025 దీపావళి సందర్భంగా జరిగిన వ్యాపారం దాదాపు రూ. 5.40 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది 2024లో జరిగిన రూ. 4.25 లక్షల కోట్ల వ్యాపారంతో పోలిస్తే 25% వృద్ధిని సూచిస్తోంది. ఈ పెరుగుదలకు గల కారణాలపై సర్వే చేసినప్పుడు, 87% మంది వినియోగదారులు ప్రధాని మోడీపై ఉన్న అభిమానంతో ఉద్దేశపూర్వకంగానే స్వదేశీ వస్తువులను కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. ఈ వృద్ధిలో సహకార, వ్యవసాయ రంగాలు కాకుండా, దాదాపు 9 కోట్ల చిన్న వ్యాపార యూనిట్ల కృషి ఎంతో ఉంది. ఈ పండుగ సీజన్లో అదనంగా 50 లక్షల మందికి స్వల్పకాలిక ఉపాధి లభించింది. మొత్తం అమ్మకాల్లో చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల వాటా 28%గా ఉండటం ఈ ఉద్యమం ఆర్థిక వికేంద్రీకరణకు నిదర్శనం.

## జీఎస్టీ తగ్గింపు కారణం

ఈ వ్యాపార పెరుగుదలకు జీఎస్టీ రేట్ల తగ్గింపు కూడా ఒక కారణమని 72% మంది వ్యాపారులు అభిప్రాయపడ్డారు. మార్కెట్ విశ్లేషణల ప్రకారం, మొత్తం పండుగ సీజన్లో వినియోగదారుల వ్యయం రూ. 12 లక్షల కోట్ల నుండి రూ. 14 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. ఇది ప్రపంచ ఆర్థిక మాంద్య పరిస్థితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టతను చాటుతోంది.

## ప్రభుత్వ ప్రోత్సాహం - భవిష్యత్ ప్రణాళిక

కేవలం ప్రజల మనోభావాలను మార్చడమే కాకుండా, ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలతోనూ స్వదేశీ పరిశ్రమలకు అండగా నిలుస్తోంది.



'కుమ్మరి సాధికారత కార్యక్రమం', ఎంఎస్ఎంఈ పరిధిలోని వస్త్ర, లోహ పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలు కూడా ఈ ఆర్థికాభివృద్ధికి కీలక పాత్ర పోషించాయి. 'కుమ్మరి సాధికారత కార్యక్రమం' ద్వారా కుమ్మరులకు ఆధునిక చక్రాలను పంపిణీ చేయడం. ఎంఎస్ఎంఈ పరిధిలోని వస్త్ర, లోహ, వెదురు పరిశ్రమలకు ప్రత్యేక ప్యాకేజీలు, రుణ సదుపాయాలు కల్పించడం. 'పిఎం విశ్వకర్మ' వంటి పథకాల ద్వారా సంప్రదాయ వృత్తుల వారికి శిక్షణ, ఆర్థిక సహాయం అందించడం. ఈ చర్యలన్నీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

## ఖాదీ రంగంలో విప్లవం

స్వదేశీ ఉద్యమంలో అత్యంత కీలకమైన మలుపు 'ఖాదీ' రంగంలో చోటుచేసుకుంది. ఒకప్పుడు కేవలం స్వాతంత్ర్య సమరయోధుల వస్త్రంగా మాత్రమే పరిమితమైన ఖాదీని, ప్రధాని మోడీ "దేశం కోసం ఖాదీ, ఫ్యాషన్ కోసం ఖాదీ" అనే నినాదంతో యువతకు చేరువ చేశారు. ఫలితంగా, 2014 నుండి ఖాదీ అమ్మకాల్లో అద్భుతమైన వృద్ధి నమోదైంది. 2014లో రూ. 3,154 కోట్లుగా ఉన్న ఖాదీ అమ్మకాలు, 447% వృద్ధితో 2025 నాటికి రూ. 1.71 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ భారీ వృద్ధి ఒక్క ఖాదీ రంగంలోనే 10 లక్షలకు పైగా కొత్తఉద్యోగాలను సృష్టించింది. ఇది గ్రామీణ మహిళలకు, నేతన్నలకు ఎంతో ఊరటనిచ్చింది. ఇది కేవలం ఆర్థిక సంఖ్యల పెరుగుదల మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లోని పేద చేతివృత్తులవారికి దక్కిన గౌరవం, స్థిరమైన జీవనోపాధి.

## ఇది ఆరంభం మాత్రమే

ప్రధాని మోడీ పిలుపుతో మొదలైన ఈ 'స్వదేశీ' ప్రయాణం, కోట్లాది మంది భారతీయుల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకువచ్చింది. కేవలం తాత్కాలిక ఉత్సాహాన్ని కలిగించేదిగా కాకుండా, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రత్యేకించి అట్టడుగు వర్గాలకు శాశ్వత స్థిరత్వం, సాధికారత కల్పించే ఒక సుదూరమార్గాన్ని నిర్మిస్తోంది.పండుగల సందర్భంగా పెరిగిన ఈ వాణిజ్యం మార్కెట్లో కొనుగోలు శక్తిని పెంచింది. తద్వారా జాతీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. ఈ నూతన ఆర్థిక కార్యకలాపాలు, ప్రపంచ ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడంలో భారతదేశానికి ఒక బలమైన పునాదిని అందిస్తాయి. ఈ స్ఫూర్తి కేవలం పండుగలకే పరిమితం కాకూడదు. స్వదేశీ, స్వయం సమృద్ధి అనేవి కాలానుగుణమైన ఆచరణలు కాకుండా, మన దైనందిన జీవితంలో అంతర్భాగం కావాలి. అప్పుడే, మహాత్మా గాంధీ కలలు కన్న 'హింద్ స్వరాజ్', దీనదయాళ్ ఉపాధ్యాయ ఆకాంక్షించిన 'అంత్యోదయ' నిజమైన అర్థంలో సాకారమవుతాయి. ప్రపంచ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ, భారతదేశం ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలంటే, 'వోకల్ ఫర్ లోకల్' అనేది మన జీవన విధానంగా మారాలి.

# జిల్లా అధ్యక్షుల సమావేశం




విజయవాడ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో రాబోయే రోజుల్లో చేపట్టవలసిన కార్యక్రమాలు, పార్టీలో చేరికలు, పార్టీ బలోపేతం కోసం ప్రతి జిల్లా స్థాయి కార్యాచరణ, ప్రణాళికలపై వివరంగా చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సి ఆదినారాయణ రెడ్డి, డాక్టర్ పార్థసారథి,ఎన్ ఈశ్వరరావు, భాజపా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ తదితరులు మాట్లాడారు. అతిథిలను భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు ఆహ్వానం పలికారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్,యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీ నివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

### సత్యసాయి భగవత్ స్వరూపుడు..

సత్యసాయి బాబా శత జయంతోత్సవాలు దేశ విదేశాల్లో ఘనంగా జరుగుతున్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ సత్యసాయి ట్రస్టు సేవా కార్యక్రమాలు విశ్వవ్యాప్తం చేశారు. సత్యసాయి మానవ స్వరూపంలో భగవత్ స్వరూపుడు అన్నారు. వైద్య







రంగంలో సత్యసాయి ట్రస్టు ద్వారా అధునాతన చికిత్సలు ఉచితంగా అందించే సేవా కార్యక్రమాలకు చిరునామా. సత్య సాయిట్రస్ట్ అన్నారు 16 సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్వహించడంతో పాటు గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జల్ జీవన్ మిషన్‌కు స్ఫూర్తి సత్యసాయి బాబా ప్రేరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా ప్రకటించారు అంటే ట్రస్ట్ సేవలు అర్థం చేసుకోవచ్చు అని మాధవ్ వివరించారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి - మాధవ్



ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ సూచించారు. విజయవాడలోని భవానీ ద్వీపంలో భాజపా సంస్థాగత యోజన బైఠక్ కార్యక్రమం జరిగింది. భాజపా జాతీయ సంస్థాగత సంయుక్త ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని, జోనల్ వర్క్‌షాపుల నిర్వహణ, ప్రశిక్షణా విధానం, కార్యకర్తల ఎంపిక, కార్యక్రమాల అమలు విధానాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సమావేశంలో గతంలో పార్టీ బలోపేతం కోసం చేపట్టిన కార్యక్రమాలు సమీక్షించారు. భవి ష్యత్తు లో అనుసరించాల్సిన వ్యూహాలు, బూత్ స్థాయి నుంచి మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు సంస్థాగత విస్తరణ, కార్యకర్తల సన్నద్ధత పెంపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించా రు. “ఇక మీద బలమైన అడుగులతో ముందుకు సాగాలి. పార్టీ లక్ష్య సాధనకు ప్రతి కార్యకర్తా సైనికుడిలా సిద్ధంగా ఉండాలి” అంటూ పీవీఎన్ మాధవ్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపుని చ్చారు. రాష్ట్రవ్యాప్తంగా జోనల్ స్థాయిలో ప్రారంభమయ్యే ప్రశిక్షణ శిబిరాలను ఇందుకు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్, రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, సాలిగ్రామ లక్ష్మీప్రసన్న, మట్టా ప్రసాద్ తదితరు లతో పాటు వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కిసాన్ మోర్చా నూతన కార్యవర్గం



కిసాన్ మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గాన్ని అధ్యక్షులు శ్రీ చిగురుపాటి కుమారస్వామి ప్రకటించారు. మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తల్లా ధనరాజు (కాకినాడ), సింహాద్రి సత్యనారాయణ (తూర్పు గోదావరి), బి. శ్రీలక్ష్మి (కృష్ణా), శీనయ్య (నెల్లూరు), సతీష్ చంద్ర (కడప), బి ఈరన్న (కర్నూలు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా వేమిరెడ్డి సురేంద్రరెడ్డి (తిరుపతి), వైవి సుబ్బారావు (గుంటూరు), రాష్ట్ర కార్యదర్శులుగా అన్నెపు ఉమామహేశ్వరరావు (శ్రీకాకుళం), నాగిరెడ్డి సతీష్ రావు (కోనసీమ), దాసరి బాబి (పశ్చిమ గోదావరి), డి.నాగరాజు (ఏలూరు), చేపూరి వినయ్ నారాయణ (నెల్లూరు), వి.కిరణ్ కుమార్ (అన్నమయ్య), చింతా శరత్ కుమార్ రెడ్డి (సత్య సాయి), కోశాధికారిగా వి. పాండురంగ విఠల్ (గుంటూరు), జోనల్ ఇంఛార్జిలుగా టి. తిమ్మారెడ్డి, ఉన్నం సింహాద్రి నారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యాలయం కార్యదర్శిగా కె. రఘువంశీ సోషల్ మీడియా ఇంఛార్జిగా ఎం. అనిత లను నియమించారు.

# ఘనంగా రాజ్యాంగా ఆమోద దినోత్సవం




భాజపా రాష్ట్ర కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భం గా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవిఎన్ మాధవ్, నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీ మాధవ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు పొడిచిందని, అడుగడుగునా అంబేద్కర్‌ను అవమానించిందని విమర్శించారు. అంబేద్కర్ ఆర్థికశాఖ కోరుకుంటే న్యాయశాఖ ఇచ్చారని, ఎన్నికల్లో ఓడించేందుకు కుట్రపన్నారని విమర్శించారు. ప్రపంచ నేతగా అంబేద్కర్‌ను పరిచయం చేయాలన్నది ప్రధాని మోడీ లక్ష్యమన్నారు.

రాజ్యాంగ దినోత్సవం అంటే సంబరాలు చేసుకోవడం కాదు.. దానివెనుక అంతర్యాన్ని తెలుసుకోవాలని మాధవ్ సూచించారు. రాజ్యాంగ మౌళిక అంశాలు అందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అంబేద్కర్ ప్రేరణ తెలియాలనే యూపీ సీఎం యోగి ఆధిత్యనాధ్ జయంతి, వర్ధంతికి సెలవులు ఇవ్వకుండా ప్రత్యేక కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారన్నారు. అంబేద్కర్‌ను అభినవ మనువుగా మాధవ్ అభివర్ణించారు. కార్మికులకు, మహిళలకు అనేక చట్టాలు తెచ్చారని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ 80సార్లు సవరించిందని, ఎన్డీఏ ప్రభుత్వం ఎనిమిది సార్లు






సవరించి అనేక సంస్కరణలు తెచ్చిందని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, భాజపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాతూరి నాగభూషణం, అధికార ప్రతినిధి షేక్ బాజీ, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, ఉమా మహేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే వర్ధంతి



బడుగు, బలహీన వర్గాలను విద్యావంతులను చేయడంలో మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషి ఎనలేనిదని భాజపా సీనియర్ నేత, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీఅడ్డూరి శ్రీరామ్ కొనియాడారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో భాజపా ప్రధాన కార్యాలయంలో జ్యోతీరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. పలువురు ఓబీసీ నేతలు పాల్గొని పూలేకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయుల కొరతను అధగమించేందుకు తన సతీమణినే ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. నేటికీ వారి గొప్పతనం గురించి సమాజం చర్చించుకోవడానికి వారు చేసిన కృషే కారణమని ఆయన చెప్పారు. భాజపా సీనియర్ నాయకులు మువ్వల వెంకటసుబ్బయ్య, బలివాడ శివకుమార్ పట్నాయక్ ,అవ్వారు బుల్లబ్బాయి, రాష్ట్ర పార్టీ ఆఫీస్ కార్యదర్శి పవన్, శివ లలిత, వాసా పల్లపురాజు, పద్మజ, అడ్వకేట్ లక్ష్మణ్ రావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ సీఎం రమేశ్‌కు మాతృవియోగం



అనకాపల్లి ఎంపీ, రైల్వేబోర్డు స్టాండింగ్ కమిటీ చైర్మన్, భాజపా నాయకులు సీఎం శ్రీ రమేశ్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ(83) 26వ తేదీన తెల్లవారుజామున 3.39 గంటలకు స్వర్గ స్తులయ్యారు. అనారోగ్యానికి గురైన ఆమె వారం రోజులుగా హైదరాబాదులో చికిత్స పొందారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం వైఎస్సార్ కడప జిల్లా



ఎర్రగుంట్ల మండలంలోని స్వగ్రామం పోట్లదుర్తికి తీసుకురాగా 26 తెల్లవారు జామున ఆమె తుదిశ్వాస విడిచారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పోట్లదుర్తికి వచ్చి రత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సీఎం రమేశ్‌కు ఫోన్‌చేసి పరామర్శించారు. రమేశ్ తల్లి మృతి పట్ల ఆయన సంతా పం తెలిపారు. భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శ్రీ మధుకర్‌జీ, మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు సిఎం రమేష్ స్వగృహానికి వచ్చి ఆయనను పరామర్శించారు.



# కోస్తా జోన్ మండలాల ప్రశిక్షణ కార్యక్రమం





భాజపా ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత, దేశవ్యాప్తంగా అభివృద్ధి వికేంద్రీకరణ, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని నేతలు ఉద్ఘాటించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, తోటపల్లి గూడూరు మండలంలోని విలుకానిపల్లి గ్రామంలోని కళ్యాణ మండపంలో భారతీయ 'ప్రశిక్షణా కార్యక్రమం' జరిగింది. పార్టీ శ్రేణులకు రాజకీయ అవగాహన, రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాజపా సంఘటనా జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శ్రీశివ ప్రకాష్ జీ, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ హాజర-య్యారు. ఈ సందర్భంగా వారు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పేదలకు గృహ నిర్మాణం, ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా సామాన్యుడి జీవితంలో వచ్చిన మార్పులను ప్రతి గడపకూ వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని వారు స్పష్టం చేశారు. మూడోసారి భాజపా అధికారంలోకి వచ్చాక అభివృద్ధి వేగం పుంజుకుందని, ప్రపంచ దేశాల సరసన భారత్ సగర్వంగా నిలిచిందని వారు పేర్కొన్నారు.

## స్థానిక పోరుకు సన్నద్ధం

ఏడు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన అజెండాగా చర్చ సాగింది. త్వరలో జరగబోయే ఈఎన్నికలు కూటమి ప్రభుత్వానికి అత్యంత కీలకమని నాయకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి అధికారంలో ఉన్నందున, క్షేత్రస్థాయిలో కూడా ఈ పొత్తును బలోపేతం చేసుకోవాలని సూచించారు.

## విజయానికి కృషి

ముఖ్యంగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు విషయంలో ఎటువంటి భేషజాలకు పోకుండా, కూటమి (బీజేపీ–టీడీపీ–జనసేన) నిర్ణయించిన ఉమ్మడి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా, కేవలం కూట



మి గెలుపే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించాలని, అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి సుస్థిరం అవుతుందని నాయకులు కార్యకర్తలకు సూచించారు.



## దేశ భద్రత - క్రమశిక్షణే ఊపిరి:

భాజపా కేవలం అధికారమే పరమావధిగా కాకుండా, దేశ భద్రతకు పెద్దపీట వేసే ఏకైక పార్టీ అని భాజపా సంఘటనా జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శ్రీ శివప్రకాష్ జీ అన్నారు. దేశ సరిహద్దుల రక్షణ దగ్గర నుంచి, అంతర్గత భద్రత వరకు భాజపా రాజీలేని పోరాటం చేస్తోందని, అందుకే నేడు భారతీయ జనతాపార్టీ దేశంలోనే కాకుం డా ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఉన్నత శిఖరాలను తాకిందన్నారు. భాజపా అంటేనే క్రమ శిక్షణకు మారుపేరని, ప్రతి కార్యకర్త ఆ క్రమశిక్ష ణను పాటిస్తూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కోరారు. పార్టీ అభివృద్ధి పథంలో నడవాలంటే కార్యకర్తల త్యాగం, కృషి ఎంతో అవసరమని గుర్తుచేశారు.



ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, భాజపా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శ్రీ మధుకర్‌జీ, భరత్ కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, పొదలకూరు మండ ల ఇన్చార్జ్ మొద్దు సీనయ్య, నాయకులు రాజ య్య, బెల్లంకొండ మాలాద్రి, యశ్వంత్ సింగ్, వెంకటరెడ్డి, జనార్ధన్, అనిల్, గోపాల్‌లతో పాటు పలువురు మండల స్థాయి నాయకులు, కార్యకర్త లు హాజరై ఈ శిక్షణా శిబిరాన్ని విజయవంతం చేశారు.

♣♣♣



# గోదావరి జోన్ మండలాల ప్రశిక్షణ కార్యక్రమం



పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేస్తూ, స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ద్వారా ప్రజలకు దగ్గరవ్వాలని భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ కార్యకర్తలకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని ఒక ఫంక్షన్ హాలులో గోదావరి జోన్ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణవర్గ తరగతులు నవంబరు 26, 27న నిర్వ హించారు. ఆరు జిల్లాలకు(ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా) చెందిన మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీమాధవ్ మాట్లాడుతూ కలిసి పని చేయడానికి ఈ శిక్షణా తరగతులు ప్రేరణగా నిలుస్తాయి అన్నారు. మండల నాయకులు పార్టీ తరపున క్రియాశీలకంగా వ్యవహరించాలని, కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అన్నారు. వాడ వాడలా పార్టీ పతాకాలు ఎగరాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ముఖ్యంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో ఖచ్చితమైన నిర్ణయంతో ఉందన్నారు. రూ. 11,500కోట్ల ప్యాకేజీ మంజూరు చేయడమే దానికి నిదర్శన మని తెలిపారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను అమిత్‌షా, నిర్మలా సీతారామన్లకు సీఎం చంద్రబాబు నాయుడు వివరించి చెప్పారని, తద్వారానే ఈ ప్యాకేజీ సాధించామని తెలిపారు. ఈ విషయంలో ఇంకా తమ చిత్తశుద్ధిని ప్రశ్నించేవారి చిత్తశుద్ధిని తాము శంకిచాల్సి ఉంటుందన్నారు. శిక్షణవర్గ్ నిర్వహించుకోవడం ద్వారా నాయకుల్లో నిబద్ధత, నాయకత్వం పెరుగుతుందని అన్నారు. జాతీయపార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేస్తు న్నామనే సంగతి తెలుసుకోవాలని సూచించారు. సొంతంగా 16 రాష్ట్రాల్లో, మిత్ర పక్షాలతో కలసి ఐదు రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్నామనే సంగతి మరచిపోకూడదని, కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక అంశాల ఆధారంగా పనిచేయాలని ఆయన సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో ఎలాకలసి పనిచేయాలనేదానిపై కార్యాచరణకు అనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఉదయం స్థానిక గౌతమీ ఘాట్ వద్ద ఎమ్మెల్సీ సోము వీర్రాజు, యోగా సాధకులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ యోగా మన జీవనశైలిలో ఒక భాగమని, మన పూర్వీకులు మనకు అందించిన ఒక వైద్య విధానమని పేర్కొన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడారు. కార్యక్రమాల్లో భాజపా రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పిల్లి నాగేంద్ర, నాయకులు వెటుకూరి సూర్యనారాయణరాజు, బొమ్ముల దత్తు, నిర్మల కిషోర్, లక్ష్మీ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.












# ఉత్తరాంధ్ర జోన్ ప్రశిక్షణ కార్యక్రమం




ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ నేతలు, కార్యకర్తలు అంకితభావంతో, ఐక్యంగా ముందుకు సాగాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంజిల్లా భీమిలి నియోజకవర్గ పరిధిలోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన భాజపా మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కోసం నిర్వహించిన రెండు రోజుల శిక్షణా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ శిక్షణా శిబిరం ద్వారా పార్టీ కార్యకర్తల్లో క్రమశిక్షణ, సంఘటనా నైపుణ్యం, ప్రజా సమస్యలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. "ప్రజలకు చేరే విధంగా పార్టీ కార్యక్రమాలను రూపొందించుకోవాలి. ప్రతి మండలానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్ తయారు చేసుకోవాలి. మండల కార్యాలయాలను కేంద్రంగా చేసుకుని పార్టీ కార్యక్రమాలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా మండల నాయకులు సన్నద్ధులు కావాలి" అని శ్రీ మాధవ్ దిశానిర్దేశం చేశారు. అంతేకాదు, భవిష్యత్ రాజకీయ పరిస్థితులు, ఎన్నికల వ్యూహాలు, పార్టీ విస్తరణపై ప్రతి కార్యకర్తకు స్పష్టమైన అవగాహన ఉండాలని ఆయన నొక్కి చెప్పారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణా శిబిరంలో పలుముఖ్యమైన అంశాలపై విస్తృతచర్చ జరిగింది.. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరంగా తెలియజేయాల్సిన బాధ్యత మండలస్థాయి నాయకులపై ఉందని గుర్తు చేశారు.



"గ్రామీణ ప్రాంతాల్లో భాజపాను పూర్తిస్థాయిలో బలోపేతం చేసుకోవాలి. ఇంటింటికీ, గ్రామగ్రామానికీ, మండలాలకు పార్టీని విస్తృతంగా తీసుకెళ్లాలి. ప్రతి గ్రామంలోనూ భాజపా పతాకాన్ని ఎగురవేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి" అని శ్రీ మాధవ్ స్ఫూర్తిదాయకంగా పిలుపునిచ్చారు.

విశాఖపట్నం జిల్లా భాజపా అధ్యక్షులు శ్రీ పరశురామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శ్రీ మధుకర్‌జీ, ఎచ్చెర్ల శాసనసభ్యులు శ్రీ ఎన్. ఈశ్వరరావు, ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి శ్రీ మట్టా వెంకట ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ పైడి వేణుగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీమతి రెడ్డి

పావని, శ్రీమతి ఉమ్మడి సుజాతరాజ్, శ్రీమతి స్వప్నకుమారి, రాష్ట్ర కోశాధికారి శ్రీ ఎం. నాగేంద్ర, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీ పాంగి రాజారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీ కేశవకాంత్, శ్రీ జి. జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్య లో హాజరై, శిక్షణా తరగతుల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ రెండు రోజుల శిబిరం ద్వారా ఉత్తరాంధ్రలో బీజేపీ కార్యకర్తల్లో నూతన ఉత్తేజం, ఆత్మవిశ్వాసం నింపింది. ఆంధ్రప్రదేశ్‌లో భాజపాను పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు, స్థానిక నాయకత్వ బలోపేతం కీలకమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి









# రాయలసీమలో బలమైన ముద్ర




ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై భారతీయ జనతా పార్టీ తన ముద్రను మరింత బలంగా వేసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రాయల సీమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించిన పార్టీ, పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామగ్రామాన పార్టీని విస్తరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాలోని చారిత్రక ప్రదేశమైన గండికోట వేదికగా రాయలసీమ జోన్ స్థాయి భాజపా మండలాధ్యక్షుల శిక్షణా తరగతులు (వర్గ్) అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో రెండు రోజుల పాటు నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులకు అధినాయకత్వం భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేసింది.

## గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా..

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భాజపా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. రాయలసీమలో గతంతో పోలిస్తే భాజపా గణనీయంగా బలపడిందని, ప్రజలు ప్రత్యామ్నాయ శక్తిగా భాజపావైపు చూస్తున్నారని ఆయన అన్నారు. అయితే, ఈ ఆదరణను ఓట్ల రూపంలోకి మార్చుకోవాలంటే కేవలం పట్టణ స్థాయి కమిటీలు సరిపోవని, ప్రతి గ్రామంలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. "గ్రామ స్థాయిలో బలమైన అడుగులు వేస్తేనే రాష్ట్ర స్థాయిలో అధికారం సాధ్యమవుతుంది" అని ఆయన పిలుపునిచ్చారు.

## మోదీ సంస్కరణలే ప్రధాన అస్త్రం

ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రీమాధవ్ సూచించారు. ముఖ్యంగా దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యలకు మోదీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు ద్వారా దేశ సమగ్రతను కాపాడటంతో పాటు, ముస్లిం మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా 'ట్రిపుల్ తలాక్' రద్దు చేయడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. ఎన్డీఏ హయాంలో దేశం, రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తున్నాయని, డబుల్ ఇంజిన్ సర్కార్ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని కోరారు.

## మండల స్థాయిలో వ్యూహరచన

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి శ్రీ వై.సత్యకుమార్ మాట్లాడుతూ.. సంస్థాగత నిర్మాణంపై దిశానిర్దేశం చేశారు. పార్టీని మండల స్థాయిలో ఎలా బలోపేతం చేయాలి. కొత్త కార్యకర్తలను ఎలా చేర్చుకోవాలి. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు ఎలా చేరవేయాలి అనే అంశాలపై ఆయన కూలంకషంగా వివరించారు. ఇందు కోసం శిక్షణా శిబిరాన్ని మూడు ప్రత్యేక విభాగాలుగా నిర్వహించారు. ప్రతి విభాగంలోనూ పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు మండలాధ్యక్షులకు శిక్షణ ఇచ్చారు. నాయకులు, కార్యకర్తల మధ్య అంతరాన్ని తగ్గించి, అందరినీ



భాగస్వా మ్యం చేయడం ద్వారానే పార్టీని ముందుకు తీసుకెళ్లగలమని సత్యకుమార్ స్పష్టం చేశారు.



## కార్యకర్తల్లో జోష్

ఈ సమావేశంలో పార్టీ అగ్రనేతలు పాల్గొనడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పార్టీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శ్రీమధుకర్ జీ, క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణంపై అమూల్యమైన సలహాలు ఇచ్చారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియాఖానం, స్థానిక ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, సీనియర్ నేత



విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరంతా రాబోయే స్థానిక, సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు. గండికోటలో జరిగిన ఈ శిక్షణా శిబిరం రాయలసీమలో భాజపా ఎదుగుదలకు ఒక బలమైన పునాదిగా నిలిచిందని చెప్పవచ్చు. నాయకుల ప్రసంగాలు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే రాబోయే రోజుల్లో సీమ రాజకీయాల్లో భాజపా కీలక పాత్ర పోషించడం ఖాయంగా కనిపిస్తోంది.



# కొత్తగా 3 జిల్లాలు - 5 రెవిన్యూ డివిజన్లు

## రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం





**ప్రస్తుతం 26 జిల్లాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఇకపై 29 జిల్లాల రాష్ట్రం కానుంది. కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆమోదం తెలిపారు. మార్కాపు రం, మదనపల్లి జిల్లాలు, రంపచోడవరం కేం ద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వం... మార్పు చేర్పులకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో 29 జిల్లాలు ఏర్పడ నున్నాయి. కొత్తగా ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పా టు చేసేందుకు అంగీకరించారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను పభుత్వం ఆదేశించింది.**

### మూడు జిల్లాల భౌగోళిక స్వరూపం

### పోలవరం జిల్లా:

రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడ వరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడ వరం రెవెన్యూ డివిజన్లో రంపచోడవరం, దేవీ పట్నం, వైరామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగ వరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఉండనున్నాయి. చింతూరు డివిజన్లో ఎటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలు చేర్చారు. రంపచోడవరం కేంద్రంగా





కొత్తగా ఏర్పాటయ్యే పోలవరం జిల్లాలో 3.49 లక్షల జనాభా ఉంది.

### మార్కాపురం జిల్లా:

యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్ద లూరు నియోజకవర్గాల్లోని మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాగా మార్కాపురం ఏర్పాటు కానుంది. మార్కాపురం రెవెన్యూ డివి జన్లోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపు రాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, కనిగిరి డివిజన్ లోని హనుమంతునిపాడు, వెలి గండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్తజిల్లాల్లో ఉండనున్నాయి. మొత్తం 11.42 లక్షల జనాభాతో ఈ జిల్లా ఏర్పాటు కానుంది.

### మదనపల్లి జిల్లా

మదనపల్లి, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా మదనపల్లి జిల్లా ఏర్పాటు కానుంది. మదనపల్లి రెవెన్యూ డివిజన్ లోని మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం, తంబ




ళ్లపల్లె, ములకల చెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీ సముద్రం, బీరొంగి కొత్తకోట, చౌడేపల్లె, పుంగ నూరు మండలాలు, పీలేరు డివిజన్లోని సదుం, సోమ ల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉండనున్నాయి. మొత్తం 11.05 లక్షల జనాభాతో కొత్త జిల్లా ఏర్పడనుంది.

## రెవెన్యూ డివిజన్లలో మార్పు చేర్పులు

శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్లోని నందిగాం మండ లాన్ని టెక్కలి డివిజన్‌లో కలిపేందుకు మంత్రుల కమి టీ చేసిన సిఫార్సుకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేట యలమంచిలి నియోజక వర్గాల్లోని మండలాలతో కొత్తగా నక్కపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కాకినాడ డివిజన్లోని సామ ర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్లో విలీనం చేసేందుకు ఆమోదం తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలను రాజమహేంద్ర వరం డివిజన్‌లో కలపాలని నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలాన్ని వాసవీ పెనుగొండ మండలంగా పేరు మార్చనున్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. దీంతో పాటు అద్దంకి, దర్శి నియోజక వర్గాల్లోని మండలాలను కలుపుతూ కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. కనిగిరి రెవెన్యూ డివిజన్లో ఉన్న మర్రిపూడి, పొన్నలూరు




మండలాలను కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. కందు కూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురంను తిరుపతి జిల్లా గూడూరు డివిజన్లో విలీనం చేయనున్నారు. పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యంను చిత్తూరు డివిజన్లో కలుపనున్నారు. సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కేబీ పల్లి, కలికిరి, వాల్మీకిపురం మండలాలతో పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. పలమనేరు డివిజన్లోని చౌడేపల్లి, పుంగనూరు మండలాలను మదనపల్లి రెవెన్యూ డివి జన్లో విలీనం చేయనున్నారు. కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్ధవటంను రాజంపేట రెవెన్యూ డివిజన్లో కలపనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను కొత్త రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేయనున్నారు. కదిరి డివిజ న్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్లో విలీనం చేయ నున్నారు. పుట్టపర్తి డివిజన్లో ఉన్న గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజ న్లో కలపనున్నారు. నంద్యాల జిల్లా డోన్ రెవెన్యూ డివిజన్‌లోని బనగాన పల్లె, అవుకు, కోవెలకుంట్ల నంద్యాల డివిజన్ లోని సంజామల, కొలిమి గుండ్ల మండలాలతో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.

## 9 జిల్లాల్లో ఎలాంటి మార్పులూ లేవు

మంత్రుల కమిటీ సిఫార్సులతో కొత్తగా ఏర్పాటు చేసే జిల్లాలు, రెవెన్యూ డివిజన్లతో ప్రస్తుతం ఉన్న 17 జిల్లాల్లో మార్పు చేర్పులు చోటుచేసుకు న్నాయి. మిగతా 9 జిల్లాలు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ పట్నం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. మంత్రుల కమిటీ చేసిన ఈ ప్రతిపాదనలు వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు.

♣♣♣

# గిరిజన స్వేచ్ఛా పోరాట నిప్పుకణిక

**మధుకర్, భాజపా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి**



భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రపుటల్లో ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారు. వారిలో అడవి బిడ్డల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం వలసవాద బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిపడిన ఆదివాసీ వీరుడు 'బిర్సా ముండా'. కేవలం 25 ఏళ్ల వయసులోనే ఒక మహాశక్తిగా ఎదిగి, గిరిజనుల పాలిట దేవుడిగా (ధర్తీ ఆబా) మారిన ఆయన జీవితం నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తిదాయకం.

బిర్సా ముండా నవంబర్ 15, 1875న ప్రస్తుత జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ జిల్లా, ఉలిహ తు గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి సుగ్నా ముండా, తల్లి కర్మి హాతు. పేదరికం కారణంగా బిర్సా బాల్యం ఒక చోట స్థిరంగా సాగలేదు. మేకలనుకాస్తూ, పిల్లనగ్రోవి ఊదుతూ అడవుల్లో తిరిగే బిర్సాలో చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు కనిపించేవి.

మెరుగైన విద్య కోసం ఆయన చైబాసాలోని ఆంగ్లేయుల మిషన్ స్కూల్‌లో చేరారు. అయితే, ఆ రోజుల్లో విద్య, ఆరోగ్య సేవలు అందించే ముసుగులో మిషనరీలు అమాయక గిరిజనులను క్రైస్తవ మతంలోకి మార్చే కుట్రలు చేసేవారు. పాఠశాలలో చేరా లంటే మతం మారాలనే నిబంధనతో బిర్సా పేరును 'బిర్సా డేవిడ్'గా మార్చారు. కానీ, అక్కడ గిరిజన సంస్కృతిని కించపరుస్తూ, వారిని అవహేళన చేయడం బిర్సా గమనించారు. బ్రిటిష్‌వారి, మిషనరీల అసలు రంగును త్వరగానే గ్రహించిన ఆయన, ఆ పాఠశాలను విడిచి పెట్టి తన మూలాల్లోకి తిరిగి వచ్చారు. ఈ సంఘటన ఆయనలో తిరుగుబాటు భావ జాలాన్ని రగిలించింది.

## సామాజిక పరిస్థితులు - దోపిడీ

ఆ సమయంలో ఛోటా నాగ్‌పూర్ ప్రాంతంలో గిరిజనుల పరిస్థితి దయనీయంగా ఉండేది. అనాదిగా వస్తున్న గిరిజనుల భూమి హ క్కుల వ్యవస్థ అయిన 'ఖుంట్ కట్టి' వ్యవస్థ ను బ్రిటిష్ వారు రద్దు చేశారు. జమీందారీ వ్య వస్థను ప్రవేశపెట్టి, బయటి ప్రాంతాల నుండి వచ్చిన వడ్డీ వ్యాపారులు (వీరిని గిరి జనులు 'దికూలు' అని పిలిచేవారు), భూస్వా ములు గిరిజనుల భూములను ఆక్రమించు కోవడం మొదలుపెట్టారు. అడవిపై హక్కు ను కోల్పోయిన గిరిజనులు తమ సొంత గడ్డపైనే కూలీలుగా మారారు. వెట్టి చాకిరీ చేయాల్సి వచ్చింది. కరువు కాటకాలు, అంటువ్యాధులు వారిని పట్టిపీడిస్తున్నా బ్రిటిష్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ దయనీయ స్థితి బిర్సా ముండాను తీవ్రంగా కలచి వేసింది.

## 'బిర్సాయత్' - సామాజిక సంస్కరణ

బ్రిటిష్ వారిని ఎదిరించాలంటే ముందుగా గిరిజన సమాజం ఐక్యం కావాలని బిర్సా గ్రహించారు. మూఢనమ్మకాలు, మద్యపానం వంటి దురలవాట్లు గిరిజనులను బలహీన పరుస్తున్నాయని ఆయన భావించారు. అందుకే ఆయన ఒకనూతన మత విశ్వాసాన్ని 'బిర్సాయత్' పేరుతో ప్రారంభించారు.

ఇది కేవలం మతం కాదు, ఒక జీవన విధానం. ఇందులో ఏకేశ్వరోపాసన, పరిశుభ్రత, మద్యపాన నిషేధం, జంతు బలుల నిషేధం వంటి సూత్రాలను బోధించారు. మనం మన సంస్కృతిని గౌరవించుకుంటేనే, ఇతరులు మనల్ని గౌరవిస్తారని ఆయన చాటి చెప్పారు. ఆయన బోధనలకు ఆకర్షితులై ముండా తెగవారే కాక, ఒరాన్, ఖరియా వంటి ఇతర గిరిజన తెగలు కూడా ఆయనను అనుసరించడం ప్రారంభించాయి. ఆయన మాటల్లో ఒక దైవిక శక్తి ఉందని గిరిజనులు నమ్మారు. అందుకే ఆయనను 'ధర్తీ ఆబా' (భూమికి తండ్రి) లేదా

భగవాన్ అని పిలుచుకున్నారు.

## ఉల్గులాన్: మహా విప్లవం

బిర్సా ముండా నాయకత్వంలో గిరిజనులు ఏకతాటిపైకి రావడాన్ని బ్రిటిష్‌వారు సహించలేకపోయారు. గిరిజనులను మతమార్పిడికి దూరం చేస్తున్నాడని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నాడని భావించి ఆయనను 1895లో అరెస్టు చేసి రెండేళ్ల జైలు శిక్ష విధించారు. కానీ జైలుజీవితం ఆయన సంకల్పాన్ని మరింత దృఢపరిచింది.

జైలు నుండి విడుదలైన తర్వాత, బిర్సా ముండా బ్రిటిష్ పాలనను అంతం చేయడానికి "ఉల్గులాన్" (మహా తిరుగుబాటు) పిలుపునిచ్చారు. "అబువా రాజ్ ఏతే జన, మహారాణి రాజ్ తుండు జనా" (రాణి రాజ్యం అంతం కావాలి, మన రాజ్యం స్థాపితం కావాలి) అనే నినాదం ఛోటానాగ్‌పూర్ కొండల్లో మార్మోగింది.

## గెరిల్లా యుద్ధం

ఆయన గెరిల్లా యుద్ధ తంత్రాన్ని ఎంచుకున్నారు. 1899 క్రిస్మస్ పండుగ రోజున తిరుగుబాటు ప్రారంభమైంది. సంప్రదాయ ఆయుధాలైన విల్లంబులు, బాణాలు, రాళ్లతో గిరిజనులు... తుపాకులు కలిగిన బ్రిటిష్ సైన్యాన్ని భయపెట్టారు. పోలీస్ స్టేషన్లు, చర్చిలు, జమీం దార్ల గృహాలపై దాడులు చేశారు. ఈ యుద్ధం కేవలం బ్రిటిష్ వారిపైనే కాదు, గిరిజనులను దోచుకుంటున్న ప్రతి ఒక్కరిపై జరిగింది.

## దొంబారి కొండ పోరాటం

జనవరి 1900లో, రాంచీ సమీపంలోని దొంబారి కొండపై బిర్సాముండా తన అనుచరులతో సమావేశమై ఉండగా బ్రిటిష్ సైన్యం వారిని చుట్టుముట్టింది. జలియన్ వాలా బాగ్ మారణకాండను తలపించేలా, బ్రిటిష్ వారు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలు, పిల్లలు అని చూడ కుండా వందలాది మంది గిరిజనులను పొట్టనబెట్టుకున్నారు. అయినప్పటికీ బిర్సాముండా తప్పించుకో గలిగారు. కొంతకాలం తర్వాత ఫిబ్రవరి 3, 1900న జంకోపాయ్ అటవీ ప్రాంతంలో నిద్రిస్తున్న బిర్సాను బ్రిటిష్ వారు పట్టుకున్నారు. ఆయనను రాంచీజైలుకు తరలించారు. అక్కడ ఆయనకు కలరా సోకిందని బ్రిటిష్‌వారు ప్రకటించారు. కానీ ఆయనకు విషం ఇచ్చి చంపారనే అనుమానాలు నేటికీ ఉన్నాయి. జూన్ 9, 1900న, కేవలం 25 ఏళ్ల వయసులో, భర తమాత ముద్దుబిడ్డ బిర్సా ముండా జైలులోనే తుది శ్వాస విడిచారు.

## వారసత్వం

బిర్సాముండా మరణం వృధాకాలేదు. ఆయన రగిలించిన తిరుగుబాటుసెగ బ్రిటిష్ ప్రభుత్వాన్ని కదిలించింది. ఫలితంగా, గిరిజనుల భూమి హక్కులను కా పాడేందుకు 1908 లో చారిత్రాత్మ కమైన"ఛోటా నాగ్‌పూర్ కౌలుదారీ చట్టం" తీసుకు రావలసి వచ్చింది. ఈచట్టం గిరిజనుల భూమిని ఇతరులకు బదిలీ చేయడాన్ని నిషేధించింది. ఇది బిర్సాముండా సాధించిన అతిపెద్ద విజయం.

## అణగారిన వర్గాలకు ప్రతీక

నేడు బిర్సా ముండా కేవలం జార్ఖండ్ ప్రజలకే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న అణగారిన వర్గాలకు ఒక ప్రతీక. భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల పాత్రను గుర్తిస్తూ, నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభు త్వం బిర్సా ముండా జయంతి అయిన నవంబర్ 15ను "జన జాతీయ గౌరవ్ దివస్" (గిరిజన గౌరవ దినోత్సవం) గా ప్రకటించింది. పార్లమెంట్ మ్యూజియంలో ఆయన చిత్రపటాన్ని ఉంచడం ద్వారా దేశం ఆయనకు ఘన నివాళి అర్పించింది.



# యువత "భారత భాగ్య విధాత"



కొద్దిరోజుల క్రితం జరిగిన బీహార్ ఎన్నికల ఫలితాలతో భారత రాజకీయాలు ఒక నూతన దశలోనికి ప్రవేశించాయి. రాజకీయ సంప్రదాయక నిర్వచనాలను, విశ్లేషణలను మార్చివేశాయి. ప్రపంచ రాజకీయ వేదికను దశాబ్ద కాలంగా పరిశీలిస్తే 'జనరేషన్-జెడ్' అని పిలవబడుతున్న యువతరం, ముఖ్యంగా మహిళా ఓటర్లు కొన్ని దేశాలలో తమ రాజకీయ ప్రాధాన్యతలను, ఆకాంక్షలను, అసహనాన్ని తిరుగుబాటు ధోరణితో కూడిన అనేక రూపాలలో స్పష్టంగా చాటుతున్నారు. వాటి ని ఆధారంగా చేసుకుని గత కొంతకాలంగా రాహుల్ గాంధీ ఓట్ చోరీ అంటూ అనేక వేదికలపై దేశంలో 'జనరేషన్-జెడ్' ఉద్యమం వస్తుంది. భాజపా కథ ముగుస్తుందనే నినాదంతో దేశ యువతను, మహిళలను రెచ్చ గొడుతూ జోరుగా ప్రచారం చేసిన సందర్భంలో బీహార్ ఫలితాలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ ఎన్నికల గెలుపోటములు దేశ యువత, మహిళల ఆకాంక్షలకు, ఆలోచనలకు ప్రతిరూపంగా మారిపోయాయి. బీహార్‌లో ఎన్‌డిఏ కూటమి సాధించిన బలమైన విజయం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. ఇది దేశం యొక్క అభివృద్ధి, సుస్థి రత, జాతీయ గౌరవం పట్ల యువత, మహిళలు దృఢంగా ఉన్న విశ్వాసాన్ని, భాజపాకి, మోదీజీ నాయకత్వానికి విస్తృత స్థాయిలో లభించిన ప్రజల మద్దతును ప్రతిబింబిస్తుంది. రాహుల్ గాంధీ వంటి ప్రతిపక్ష నాయకులు భారతదేశంలో యువతరం నేతృత్వంలో "దాడులతో కూడిన 'జనరేషన్-జెడ్' ఉద్యమం" వస్తుందని ప్రచారం చేస్తున్నప్పటికీ భారతీయ యువతరం మాత్రం అభివృద్ధిని, వికాసాన్ని కోరుకుంటున్నారని, ఇతర దేశాలలో వలే విధ్వంసాన్ని కాకుండా వివేకవంతమైన మార్గాన్ని ఎంచుకున్నారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి. భారత యువతరం మోదీజీ నాయకత్వాన్ని తమ భవిష్యత్తుకు భాగ్య విధాతగా చూస్తు న్నారు.

## 1. ఉపాధి అవకాశాలు, డిజిటల్ విప్లవం

భారతీయ జెన్-జెడ్ (యువతరం) అనేది కేవలం ఉద్యో గం కోసం ఎదురుచూసే తరం కాదు. ఇది వ్యవస్థాపకత, ఆవిష్కరణలు, ప్రపంచ వేదికపై గుర్తింపును కోరుకునే తరం. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్టార్టప్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాలు ఈ యువ ఆకాంక్షలకు సరిగ్గా సరిపోయే వేది కలను అందించాయి. మొబైల్ డేటా అతి తక్కువ ధరలకు లభించడం, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వా రా ఆర్థిక వ్యవస్థ డిజిటలైజేషన్ కావడం, చిన్న పట్టణాలు, గ్రామాలలో కూడా వ్యాపార అవకాశాలను సృష్టించింది. యువత విధ్వంసం, విమర్శలలో సమయాన్ని వృధా చేసుకోవడానికి బదులు, తమ టాలెంట్‌ను ఉపయోగించి ఆర్థికంగా ఎదగడానికి, గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడటా నికి మార్గాన్ని ఎంచుకున్నారు. జనరేషన్ జెడ్ రాజకీయ అస్థిరతను కాదు, తమ కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన పటిష్టమైన ఆర్థిక వాతావరణాన్ని కోరుకుంటోంది. అందువల్ల, గత పాలనలో ఉన్న విధాన పరమైన పక్షవాతం కంటే, మోదీ ప్రభుత్వం యొక్క వేగవంతమైన, స్పష్టమై న ఆర్థిక సంస్కరణలను, స్వయం సమృద్ధి భారత్ ఆలోచనను వారు విశ్వసిస్తున్నారు.

## 2. మహిళా శక్తికి గౌరవం, సాధికారత

ఎన్నికల ఫలితాలలో బీజేపీకి మహిళా ఓటర్ల మద్దతు స్థిరంగా పెరుగుతూ వస్తోంది. దీనికి ప్రధాన కారణం, ప్రభుత్వం మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా, 'నారీ శక్తి' (స్త్రీ శక్తి)గా, దేశాభివృద్ధిలో భాగస్వాములుగా చూడటం. ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గృహాలు), జన్‌ధన్ ఖాతాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ వంటి పథకాలు మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, ఆరోగ్యభద్రతను కల్పించాయి. అంతేకాకుండా, మెరుగైన శాంతిభద్రతల పరిస్థితి, 'బేటీ బచావో, బేటీ పఢావో' వంటి సామాజిక భద్రతా పథకాలు మహిళల్లో ఒక భద్రతా భావాన్ని పెంచాయి. మరుగుదొడ్ల నిర్మాణం వంటి చిన్న చర్యలు సైతం వారికి గౌరవాన్ని, భద్రతను ఇచ్చాయి. ఈ కారణం గానే, మహిళా ఓటర్లు మోదీజీ నాయక త్వంపై తమ విశ్వాసాన్ని స్థిరంగా చూపుతున్నారు. ఇది కేవలం ఓటు బ్యాంకు రాజకీయం కాదు, తమ భద్రతకు, గౌరవానికి లభించిన హామీగా వారు భావిస్తున్నారు.

## 3. జాతీయవాదం - సాంస్కృతిక పునరుజ్జీవనం

భారతీయ యువతరం తమ జాతీయ గుర్తింపు, వారసత్వం పట్ల అపారమైన గర్వాన్ని కలిగి ఉన్నారు. మోదీ ప్రభుత్వం యొక్క జాతీయవాద భావజాలం, పటిష్టమైన విదేశాంగ విధానం, సాంస్కృతిక పునరుజ్జీవనం వంటి చర్యలు వారి హృదయాలను తాకాయి. ప్రపంచ వేదికపై భారతదేశం యొక్క స్థానం బలోపేతం కావడం, ప్రపంచ శక్తులు భారతదేశాన్ని గౌరవంగా చూడటం జనరేషన్ జెడ్‌కి ఒక గొప్ప ప్రేరణ. వారికి, ప్రభుత్వం దేశీయ విలువలను కాపాడటంతో పాటు, ఆధునికతకు అన్వయించడంలో

విజయం సాధించింది. గత పాలనలో కొంత మంది నిరంతరం తమ సంస్కృతిని, చరిత్రను విమర్శించడం చూసిన ఈతరం, తమ మూలాల పట్ల గౌరవాన్ని పెంపొందించే నాయకత్వాన్ని స్వాగతిస్తున్నారు. రాహుల్ గాంధీ ప్రచారం చేసిన "విధ్వంసక ఉద్యమం" లేదా దేశ వ్యతిరేక భావజాలం భారతీయ యువతకు ఆకర్షణీయంగా కనిపించకపోవ డానికి ఇదే ప్రధాన కారణం. వారు విదేశీ–ప్రేరేపిత, విధ్వంసక భావనల కంటే 'భారత్ ప్రథమం' అనే ఆలోచనకు కట్టుబడి ఉన్నారు.

### 4. మౌలిక సదుపాయాల విప్లవం

భారతదేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ఒక విప్లవాత్మక మార్పుకు లోనవుతోంది. కొత్త హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వేలు, విమానాశ్రయాలు, నగరాలలో మెట్రో విస్తరణ జనరేషన్ జెడ్ యొక్క రోజువారీ జీవితాన్ని సులభతరం చేశాయి. ఈ మౌలిక సదుపాయాల వృద్ధి, కేవలం సౌకర్యం కోసం మాత్రమే కాదు, ఇది పెట్టుబడులు, ఉద్యోగాలు, మెరుగైన కనెక్టివిటీకి ప్రతీక. యువతరం తమ చుట్టూ జరుగుతున్న దృశ్యమానమైన అభివృద్ధిని చూస్తున్నారు. కేవలం హామీలను కాదు, పూర్తయిన ప్రాజెక్టులను చూస్తున్నారు. రాజకీయ విమర్శలు, ఆందోళనల కంటే, తమ ప్రయాణ సమయాన్ని తగ్గించే నిర్మాణమైన రహదారులను, తమ వ్యాపారానికి వేదికను ఇచ్చే అభివృద్ధిని వారు ఎంచుకుంటున్నారు. ఇది ఆచరణాత్మకమైన ఎంపి క, భావోద్వేగపూరితమైన ఆందోళన కాదు.

### 5. సంక్షేమ పంపిణీలో పారదర్శకత

మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పంపిణీలో పారదర్శకతను పెంచింది. ఆధార్, జన్‌ధన్, మొబైల్ (ట్రినిటీ) ఉపయోగించి లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు చేరేలా చూడటం వల్ల మధ్యవర్తులు, అవినీతి తగ్గాయి. జనరేషన్ జెడ్, సమాచార యుగంలో పుట్టి పెరిగినందున, పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని కోరుకుంటుంది. పాత పద్ధతుల లోని అవినీతి, జాప్యం వారికి నచ్చవు. అందుకే, వారు తమకు నేరుగా ప్రయోజనాలను అందించే, పారదర్శకంగా పనిచేసే నాయకత్వాన్ని ఆమోదిస్తున్నారు. ఈ పారదర్శకత, ప్రభుత్వం పట్ల వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసింది.

### అభివృద్ధి మార్గం

భారతీయ యువతరం, మహిళలు అభివృద్ధి యొక్క మార్గాన్ని ఎంచుకు న్నారు. వారు కేవలం నినాదాలను, విమర్శలను కాదు, సంకల్పం, సంస్క రణ, సుస్థిరతను కోరుకుంటున్నారు. బీహార్ నుండి వెలువడిన ఎన్నికల ఫలితాలు జనరేషన్ జెడ్ రాజకీయంగా పరిపక్వత చెందుతున్నదని, వివేక వంతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని స్పష్టంగా చూపిస్తున్నాయి. దేశంలోని యువతరం "విధ్వంసం" వైపు మొగ్గు చూపకుండా, "వికాసం" వైపు దృష్టి సారించారు. మోదీజీ నాయకత్వం ఈ యువ ఆకాంక్షలకు, జాతీయవాద భావాలకు, సాంస్కృతిక గౌరవానికి ఆర్థిక వృద్ధికి ఒక పటిష్టమైన వారధిగా పనిచేస్తోందని భావించారు. కాబట్టి, భారతీయ యువతరం మోదీజీ ఆత్మ నిర్భర భారత్ (స్వయం సమృద్ధ భారత్) ఆలోచనతో ప్రపంచానికి నాయకత్వం వహించ డానికి సిద్ధంగా ఉంది. భారత జనరేషన్ జెడ్ నిస్సందేహంగా దేశ భవిష్యత్తుకు భాగ్యవిధాతగా మోదీజీని చూస్తున్నారు. భారతీయ జనరేషన్ జెడ్ నరేంద్ర మోదీ వికసిత భారత్ యొక్క సంకల్పాన్ని నెరవేర్చే దిశగా తమ ఓటుతో అభివృద్ధిని ఎంచుకుంది, విధ్వంసాన్ని కాదు అని నిరూపితమైంది.





# వైభవంగా హిందూ సమ్మేళనం



విశాఖపట్నం జిల్లా, తగరపువలస జంక్షన్ సమీపంలోని చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వేదికగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 'హిందూ సమ్మేళనం' అత్యంత వైభవంగా జరిగింది. నవంబరు 30, సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానికులు, హిందూ బాంధవులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఈ సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రచారక్, భాజపా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శ్రీమధుకర్‌జీ ప్రసంగిస్తూ, సనాతన ధర్మ పరిరక్షణ కోసం దేశంలోని హిందువులంతా ఏకంకావాలని పిలుపునిచ్చారు. హిందుత్వం అనేది కేవలం ఒక ఉపాసన పద్ధతి లేదా మతం కాదని, అది మానవ జాతిని సన్మార్గంలో నడిపించే ఒక విశిష్టమైన, శాస్త్రీయమైన 'జీవన విధానం' అని ఉద్ఘాటించారు. హిందూ సమాజం ఐక్యంగా ఉంటేనే దేశం బలోపేతమవుతుందని, బాహ్య శక్తుల దుశ్చర్యల నుంచి సనాతన ధర్మాన్ని కాపాడుకోగలమని ఆయన ఉద్బోధించారు.



మరో విశిష్ట అతిథి, ఆధ్యాత్మికవేత్త స్వామి రామకృష్ణానంద ప్రసంగిస్తూ, భారతీయ సంస్కృతి, హిందూ మతం యొక్క ఔన్నత్యాన్ని స్వామి వివేకానందుడు ఏనాడో విశ్వవేదికపై చాటిచెప్పారని, ఆ స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని సూచించారు. సమాజంలో సమరసతను పెంపొందించే దిశగా, వివిధ కులవృత్తులు చేసుకునే శ్రమజీవులను వేదిక పైకి సాదరంగా ఆహ్వానించి, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించడం ఈ సభలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి వన్నె తెస్తూ చిన్నారులు, కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు, గ్రామవికాస సమితి జిల్లా అధ్యక్షుడు గాడు వెంకటప్పుడు, విశ్వహిందూ పరిషత్తు జిల్లా కార్యదర్శి జీవీ నారాయణ, సమరసత సంఘం జిల్లా కన్వీనరు కోరుకొండ రామలక్ష్మి, ఆర్ఎస్ఎస్ కార్యవహ సభాధ్యక్షులు తమ్మిన నర్సింగరావు తదితర ప్రముఖులు పాల్గొని జయప్రదం చేశారు.

# ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జి రెడ్డి అభినందన సభ





ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొజ్జి రెడ్డి, సభ్యులకు విజయవాడ తుమ్మల పల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అభినందన సభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజరై ఛైర్మన్, సభ్యులను అభి నందించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లపై ఉందన్నారు. గిరి జన తెగ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా 151 వ జయంతి సందర్భంగా 15 రోజులపాటు ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ మాట్లాడుతూ తాను బొజ్జి రెడ్డి మంచి మిత్రులమని, ఒక రాజ్యాంగ బద్ధ పదవిని బొజ్జి రెడ్డిని వరించ డం సంతోషకరమైన విషయమన్నారు. ఎమ్మె ల్సీ సోము వీర్రాజు ఎస్టీ కమిషన్ ఛైర్మన్, సభ్యులను అభినందించారు. భాజపా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాలశిరీష, ఎస్సీ కమిషన్ కార్యదర్శి చిన్నరాములు, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.





భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి కార్యక్రమం




అయోధ్యలో శ్రీరాముడి పూజల్లో మోడీ



ఉడిపిలో శ్రీకృష్ణ పరమాత్ముడి సేవలో మోడీ

Declaration : Rc.(A11)A9/150-11/2023 RNI.NO.70770I1999.




Published and Printed by NOOKALA MADHUKAR on behalf of Bharateeya Janata Party and Printed at Kala Jyothi Process Pvt Ltd, Nidumukkula Village, Guntur -522016, Andhra Pradesh , A.P. Editor : VAMARAJU SREE SATYA MURTHY Phone: 0866-2441135, 9494949059. Email.kamalavani2017@gmail.com